తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
30 ఏళ్ళ ప్రస్థానం వార్షికోత్సవం 1996 - 2026

## వ్యాపార సముదాయమా...
# వసతి గృహాలా!

**- శ్రీ నాగేశ్వర స్వామి దేవస్థానం కాంప్లెక్స్‌లో నిబంధనలకు పాతర**



వ్యాపార సముదాయాలపై... వసతి గృహాల నిర్మాణ దృశ్యం

సూళ్లూరుపేట, సెప్టెంబర్ 16 ప్రభాతవార్త: సూళ్లూరుపేటలోని శ్రీ నాగేశ్వర స్వామి దేవస్థానం ఆదాయాన్ని పెంచే వనరుగా భావించి గత దేవస్థాన పాలక మండలి వ్యయ ప్రయాసలు కోర్చి దేవస్థానం ఉత్తరం వైపున వ్యాపార సముదాయాన్ని నిర్మించారు. అనంతరం ఈ సముదాయానికి వేలం పాటలు నిర్వహించి షాపులు పెట్టుకునేందుకు అనుమతించారు. ఇక్కడ వరకు సమజసం గానే ఉంది. కాగా ఈ షాపులు వేలంపాటలో దక్కించుకున్న వారు క్రింది భాగంలో ఉన్న మూడు షాపులలో వ్యాపారాలు చేసుకుంటూ పైన ఉన్న మరో మూడు రూములను ఏకంగా వసతి గృహాలుగా మార్చుకున్నారు. ఇందులోని వారు నివాసముంటు తమ పనులు చేసుకుంటున్నారు. దేవాదాయ శాఖ నిబంధన ప్రకారం టెండర్లు పొందుపరిచిన విధంగా ఈ వ్యాపార సముదాయాల్లో షాపులు పెట్టుకొని వ్యాపారం చేసుకోవలసిన అవసరం ఉంది. కానీ పేరుకు మాత్రం పై భాగంలో వ్యాపారాలు చేసుకుంటున్నట్లు టెండర్లులో వేలం పాడుకునిఅక్కడే కాపురాలు చేసుకుంటున్నారు. దేవాదాయ శాఖ నిబంధనలకు పాతర వేస్తున్నారు. ఈ విషయం దేవస్థానం వారితో పాటు సంబంధిత అధికారులకు తెలిసిన వారు చూసి చూడనట్టుగా వ్యవహరిస్తున్నారు. ఈ విషయమై దేవస్థానం కు వచ్చే భక్తులు తీవ్రంగా నిరసన వ్యక్తం చేస్తున్నారు. ఆలయ ఆదాయ వనరుల కోసం నిర్మించుకున్న వ్యాపార సముదాయం ప్రస్తుతం దారితప్పి వసతిగృహాలుగా మారడం పట్ల అధికారులు స్పందించి చర్యలు తీసుకొని ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తే సమంజసంగా ఉంటుందని పలువురు కోరుతున్నారు.

## ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో...
# భక్తులకు మెరుగైన సేవలు

**-హీలింగ్ డివోషన్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్ ప్రారంభోత్సవంలో సిఎం**




తిరుమల హీలింగ్ డివోషన్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌ను ప్రారంభించిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు - వివరాలు తెలియజేస్తున్న టిటిడి ఇఒ

తిరుమల,సెప్టెంబర్ 16ప్రభాతవార్తప్రతినిధి: భక్తుల భద్రత, సౌకర్యాలు ఆధ్యాత్మిక అనుభూతికి పెద్దపీటవేస్తూ సాంకేతిక పరిజ్ఞానంతో మెరుగైన సేవలందించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులకు ఆదేశాలిచ్చారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో భక్తులకు మెరుగైన సేవలందించాలన్నారు. బుధవారం ఉదయం తిరుమలలో పలు అభివృద్ధి కార్యక్రమాలను సిఎం ప్రారంభించారు. హీలింగ్ డివోషన్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్, దుర్లభ దర్శన్ వీఆర్ అనుభవం, విద్యుత్ బస్సులు, వేంకటేశ్వర మ్యూజియం, నందకం యాప్, భక్తులకు గ్రూప్ ఇన్సూరెన్స్ పథకం కార్యక్రమాలు ఉన్నాయి. వైకుంఠం క్యూ కాంప్లెక్స్-1లోని 17వ కంపార్ట్‌మెంట్‌లో ఏర్పాటు చేసిన తిరుమల హీలింగ్ డివోషన్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌ను ముఖ్యమంత్రి ప్రారంభించారు. భక్తులు శ్రీవారి దర్శనం కోసం వేచి ఉండే సమయాన్ని ఆధ్యాత్మికంగా సద్వినియోగం చేసుకునేలా ఈ కేంద్రాన్ని రూపొందించారు. తిరుమల చరిత్ర, ఆధ్యాత్మిక ప్రాశస్త్యాన్ని ఏఐ, వర్చువల్ రియాలిటీ, ఇంటరాక్టివ్ డిస్‌ప్లేల ద్వారా భక్తులకు అందించడంతో పాటు గైడెడ్ మెడిటేషన్ కార్యక్రమాలను నిర్వహిస్తారు. ఈ ధ్యాన కార్యక్రమాలను వైకుంఠం క్యూ కాంప్లెక్స్-1, 2లో వేచి ఉండే భక్తులకు ప్రత్యక్ష ప్రసారం చేస్తారు. ఇదే కేంద్రాన్ని టిటిడి ఉద్యోగుల శిక్షణకు కూడా వినియోగించనున్నారు. హీలింగ్ డివోషన్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌లో భాగంగా ఏర్పాటు చేసిన "దుర్లభ దర్శన్" వర్చువల్ రియాలిటీ అనుభవాన్ని ముఖ్యమంత్రి ప్రారంభించారు. అత్యాధునిక వీఆర్ హెడ్‌సెట్ ద్వారా 13 నిమిషాల 3డి, 360 డిగ్రీల వర్చువల్ రియాలిటీ చిత్రాన్ని భక్తులు వీక్షించవచ్చు. ఇందులో వేంకటేశ్వరస్వామి వైభవంతో బాటు సాధారణంగా పరిమిత సంఖ్యలో భక్తులకు మాత్రమే వీక్షించే అవకాశం లభించే సుప్రభాతం, తోమాల సేవ, సహస్రనామార్చన, అభిషేకం తదితర విశిష్ట సేవలను వీఆర్ సాంకేతికత ద్వారా దగ్గరగా వీక్షించిన అనుభూతిని కల్పిస్తారు.

తిరుమలలో భక్తుల ఉచిత రవాణా సౌకర్యాలను మరింత విస్తరించేందుకు విరాళంగా అందిన 32 ఎలక్ట్రిక్ బస్సులను శ్రీవారి ధర్మరథాలుగా ముఖ్యమంత్రి ప్రారంభించారు. ప్రస్తుతం రోజుకు 300 ట్రిప్పులు నిర్వహిస్తుండగా, కొత్త బస్సులతో మూడు మార్గాల్లో రోజుకు 810 ట్రిప్పులు నిర్వహించనున్నారు. ఆధునిక సాంకేతికతతో ఆధ్యాత్మిక, సాంస్కృతిక వైభవం తిరుమలలోని వేంకటేశ్వర మ్యూజియాన్ని ముఖ్యమంత్రి ప్రారంభించారు. 1998లో ప్రారంభమైన ఈ మ్యూజియాన్ని టిసిఎస్ సంస్థ సహకారంతో నూతన గ్యాలరీలు, ఇమ్మర్సివ్ టెక్నాలజీ, ఆధునిక సౌకర్యాలతో పూర్తిగా పునరుద్ధరించారు. సుమారు లక్ష చదరపు అడుగుల విస్తీర్ణంలో నాలుగు అంతస్తుల్లో 14 ప్రత్యేక గ్యాలరీలను ఏర్పాటు చేసి, 8వేలకు పైగా అరుదైన ప్రదర్శన వస్తువులను అందుబాటులో ఉంచారు. శ్రీవారి ఆభరణాలు, ఆలయ కళా సంపద, శిల్పాలు, అన్నమయ్య రాగి రేకులు, అరుదైన నాణేలు, ఆలయ నిర్మాణ శాస్త్రం, భక్తులు-దాతలు, ఆయుధాలు, సంగీత వాయిద్యాలు, పూజా సామగ్రి, త్రిమూర్తులు, వేదాలు తదితర అంశాలను వివిధ గ్యాలరీల్లో ప్రదర్శిస్తున్నారు. హోలోగ్రాఫిక్ డిస్‌ప్లేలు, 360 డిగ్రీల సౌండ్, ఇంటరాక్టివ్ డిజిటల్ డిస్‌ప్లేలు, డిజిటల్ ఆర్కైవ్స్ వంటి ఆధునిక సాంకేతికతను వినియోగించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రమంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, అనగాని సత్యప్రసాద్, సిఎం ప్రత్యేక కార్యదర్శి ప్రద్యుమ్న, టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు, టిటిడి ఈఓ ముద్దాడ రవిచంద్ర, తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్, టిటిడి అదనపు ఈఓ వెంకయ్యచౌదరి, జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు, ఎస్వీబిసి ఛైర్మన్ బి.శ్రీధర్‌వర్మ,బోర్డు సభ్యులు, టిసిఎస్ ఎండీ కె. కృతివాసన్, ప్రెసిడెంట్ వి. రాజన్న, ప్రోగ్రామ్ డైరెక్టర్ ఎ. భీమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# బాలాజీ సాగర్‌కు...కండలేరు నీరు

**-తిరుపతిలో స్కైవాక్ ఏర్పాటు -స్విమ్స్,రుయా,బర్డ్,చిన్నపిల్లల ఆస్పత్రులు అనుసంధానం -టిటిడి విద్యాసంస్థల్లో స్కిల్ డెవలప్మెంట్ ఏర్పాటు -టిటిడి అధికారులతో సిఎం చంద్రబాబు**



మీడియాతో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి, ఇతర ప్రముఖులు

తిరుమల,సెప్టెంబర్ 16ప్రభాతవార్తప్రతినిధి: తిరుమలకు విచ్చేసే భక్తులకు తాగునీటి సమస్య ఎదురుకాకుండా వచ్చే ఏడాదికి కండలేరు నుండి బాలాజీ సాగర్‌కు నీరు తీసుకొస్తామని రాష్ట్ర సిఎం చంద్రబాబునాయుడు తెలిపారు. అదే ఏడాదికి కల్యాణి డ్యామ్ కు కూడా నీటిని తరలిస్తామన్నారు. తీవ్ర వర్షాభావ పరిస్థితుల్లోనూ గతంలో కల్యాణి డ్యామ్ నుండి పైపులైన్‌ను వంద రోజుల్లో వేసి తిరుమలకు నీరు తరలించామని ఆయన గుర్తుచేశారు. రెండురోజుల తిరుమల పర్యటనలో భాగంగా బుధవారం ఉదయం టిటిడి బోర్డు, అధికారులతో సిఎం చంద్రబాబు అభజవృద్ధి పనులపై సమీక్షించారు. రాష్ట్ర మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, అనగాని సత్య ప్రసాద్, టిటిడి ఛైర్మన్ బిఆర్ నాయుడు, ఈఓ ముద్దాడ రవిచంద్ర, జిల్లా కలెక్టర్ డాక్టర్ వేంకటేశ్వర్, టిటిడి అదనపు ఈఓ సి.హెచ్.వెంకయ్య చౌదరి, టిటిడి జెఈఓలు డాక్టర్ ఎ. శరత్,ప్రభల గోపీనాథ్ ,జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు, సివిఎస్ఓ కే వి.మురళీకృష్ణ ఇతర ప్రజా ప్రతినిధులు బోర్డు సభ్యులు, ఇతర అధికారులు పాల్గొన్నారు. తిరుపతి రైల్వే స్టేషన్ నుండి బస్టాండ్ వరకూ లింక్ చేసేలా స్కైవాక్ ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదన ఉందని తెలిపారు. త్వరలోనే కేంద్ర సహకారంతో ఈ ప్రాజెక్టు చేపడతామన్నారు. తిరుపతి లో ఇటీవల సేకరించిన 50 ఎకరాల్లో మల్టీస్టోరీడ్ పార్కింగ్ ఏర్పాటు చేయాలని భావిస్తున్నామని తెలిపారు. త్వరలోనే తిరుపతిని వివిధ హైవేలకు కనెక్టు చేసేలా కార్యాచరణ చేపడతామని, ఇందుకు ప్రణాళికలు సిద్దంచేస్తున్నామని సిఎం వెల్లడించారు. శ్రీవారిని దర్శించుకోడానికి వచ్చే భక్తులతో తిరుమల తిరుపతి సర్వీస్ హబ్‌గా మారుతుందన్నారు. సౌర, పవన విద్యుత్‌తో బాటు బ్యాటరీ స్టోరేజి ద్వారా విద్యుత్ ఉత్పత్తి జరగాలని సిఎం ఆదేశించారు. ప్రాణదానం ట్రస్ట్ క్రింద రోగులకు మరింత నాణ్యమైన వైద్య సేవలు. స్విమ్స్, బర్డ్, రుయా, సెంట్రల్ హాస్పెటల్, కార్డియాలజీ ఆసుపత్రులను అనుసంధానం చేసే దిశగా అధికారులకు సూచనలు చేశానన్నారు. శ్రీవారి వైద్య సేవలను విరివిగా అందించేలా పటిష్ట చర్యలు చేపట్టాలని ఆదేశించారు. టిటిడి విద్యాసంస్థల్లో ముఖ్యంగా పాలిటెక్నిక్ కళాశాలలో స్కిల్ డెవలప్మెంట్ ఏర్పాటు చేసి ఉపాధికి శిక్షణఇవ్వాలన్నారు.

# వీణాపాణిగా...మలయప్ప దర్శనం

**-హంస వాహనంపై శ్రీవారు ఊరేగింపు**



తిరుమల,సెప్టెంబర్ 16ప్రభాతవార్తప్రతినిధి: తిరుమలేశుని సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో బుధవారం రాత్రి వీణాపాణియై మలయప్పస్వామి హంస వాహనంపై ఆలయ మీఢవీధుల్లో ఊరేగారు. వాహనమండపం వద్ద నుండి బయలుదేరిన స్వామివారి వాహనంపై కొలువుదీరిన మలయప్పకు భక్తులు అడుగడుగునా కర్పూర హారతులిచ్చారు.బ్రహ్మోత్సవాల్లో ఉదయం మలయప్ప స్వామి పాండురంగస్వామి అలంకారంలో ఐదు తలల చిన్న శేషవాహనంపై తిరుమాడ వీధులలో విహరిస్తూ భక్తులను అనుగ్రహించారు. ఈ వాహన సేవలో పెద్దజీయర్‌స్వామి, చిన్నజీయర్‌స్వామి, టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు, ఈఓ ముద్దాడ రవిచంద్ర, బోర్డుసభ్యులు, అదనపు ఈఓ వెంకయ్య చౌదరి, సివిఎస్ఓ మురళీకృష్ణ, జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు,ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రూ.285 కోట్లతో కోకా కోలా విస్తరణ!

**-శ్రీకాళహస్తి మండల ప్రజల ఉపాధికి ఊతం**




శ్రీకాళహస్తిరూరల్,సెప్టెంబర్ 16 ప్రభాతవార్త: శ్రీకాళహస్తి మండలంలోని ఇసుక గుంట గ్రామం వద్ద నిర్వహిస్తున్న హిందూస్థాన్ బేవరేజెస్ కోకా కోలా బేవరేజస్ పరిశ్రమను విస్తరించటానికి రూ.285 కోట్లు ఆ సంస్థ మంజూరు చేసిందని సమాచారం అందింది. విజయనగరంలో పరిశ్రమ విస్తరణకు రూ.842 కోట్లు కేటాయించగా శ్రీకాళహస్తి పరిశ్రమకు కూడా నిధులు 285 కోట్లు మంజూరు చేసారు. పరిశ్రమల విస్తరణలో భాగంగా కోకో కోలా చొరవ చూపుతుంది.శ్రీకాళహస్తి నియోజకవర్గం పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతుంది. నాడు బొజ్జల గోపాలకృష్ణారెడ్డి చొరవతో ఇసుకగుంట వద్ద లక్ష్మీబాట్లింగ్ పరిశ్రమకు స్థలం కేటాయించారు. ఈ పరిశ్రమ నేడు హిందూస్థాన్ బేవరేజస్ కోకా కోలాగా నిర్వహిస్తున్నారు. ఈ పరిశ్రమతో ఇప్పటికే చుట్టు పక్కల సుమారు 20 గ్రామాల ప్రజలు ఉపాది అవకాశాలు పొందుతున్నారు. పరిశ్రమ విస్తరణతో ఇంకా ఉపాధి అవకాశాలు పెరిగే అవకాశం ఉంది. సుమారు పాతిక సంవత్సరాల క్రితం చుట్టుపక్కల గ్రామాల ప్రజలు ముఖ్యంగా మహిళలు కేవలం ఇంటికే పరిమితమయ్యే వారు. గోపాలకృష్ణారెడ్డి మొదట పాడిపరిశ్రమతో మహిళలకు గృహోపయోగంగా ఆర్థిక మద్దతు కల్పించారు. తరువాత కోకా కోలా ఫ్యాక్టరీ రావటంతో ఉపాధికి అవకాశం వచ్చింది. ప్రస్తుతం పరిశ్రమ విస్తరణతో మరింత అభివృద్ధితో పాటు ఉపాధికి ఆవకాశం వచ్చిందని చెప్పవచ్చు,

# చాటింపుతో ప్రారంభమైన పోలేరమ్మ జాతర

**- ఈ నెల 30, అక్టోబర్ ఒకటో తేదీన జాతర**

బాలాయపల్లి, సెప్టెంబర్ 16 ప్రభాతవార్త: దక్షిణ భారతదేశంలోనే ప్రసిద్ధిగాంచిన గ్రామ శక్తి పోలేరమ్మ జాతర ఈనెల 30, అక్టోబర్ నెల ఒకటో తేదీ జరుగుతుందని మొదటి చాటింపు వేశారు. జాతర నిర్వహణకు రాజాల నుండి ఆలయం శ్రీనివాసులు రెడ్డి తాంబూలాలు తీసుకొని అనుమతి పొందారు. ఈనెల 23వ తేదీ అమ్మవారి జాతర జరుగుతుందని రెండో చాటింపు వేస్తారు. 30వ తేదీ అర్ధరాత్రి నుండి జాతర ప్రారంభమవుతుంది. అమ్మవారిని కుమ్మరి వీధిలో తయారుచేసి భక్తుల దర్శన అవసరం పోలేరమ్మ గుడి వద్ద ఉంచుతారు. అక్టోబర్ నెల ఒకటో తేదీ సాయంత్రం వరకు అమ్మవారిని దర్శించుకున్న తర్వాత నిరూప కోసం ఊరేగింపుగా తీసుకొని వెళ్తారు. జాతర చాటింపు రోజు నుండి పూర్తయ్యే వరకు పట్టణంలో ఎలాంటి శుభకార్యాలు చేయరు. ఈ ఆచారం తరతరాల నుండి వస్తోంది.



## 100 పడకల ఆసుపత్రిలో...
# రోగులు 20 మంది

**-శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రిలో ఎవరికి వారే! -ఎఫ్ఆర్ ఎస్ ఎందుకు అమలు చేయరు? -చెక్‌బుక్ చిరుద్యోగి చేతికి ఎలా వచ్చింది? ఎఓ ఏమయ్యారు?**



శ్రీకాళహస్తి,సెప్టెంబర్ 16 ప్రభాతవార్త : శ్రీకాళహస్తి,సత్యవేడు నియోజకవర్గాల పేద ప్రజలకు కార్పొరేట్‌స్థాయి వైద్యసేవల కోసం ఏర్పాటు చేసిన వంద పడకల ఆసుపత్రిలో పరిపాలన రోజు రోజుకు దిగజారుతుంది.మంగళవారం ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మురళీ కృష్ణ తన ఆసుపత్రిలో చిరుద్యోగులు తన సంతకం ఫోర్జరీ చేసి అవతవకలకు పాల్పడ్డారని టూ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసారు.ఆయన ఫిర్యాదు మేరకు టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి చేతులు దులుపుకున్నారు. అయితే ఈ కేసుకు సంబంధించి నిందితులను తప్పించుటకు 'రాజకీయం' ప్రవేశించింది. ఎవరికి వారు ఎవరి ఇష్టం వచ్చినట్లు వారు వ్యవహరిస్తున్నారు. వంద పడకల ఆసుపత్రిలో ఇన్‌పేషెంట్లు కేవలం 20.నేటికి ఈ ఆసుపత్రికి వచ్చిన కాన్పు కేసులు ఏదో వంకతో తిరుపతికి తరలిస్తున్న సంఘటనలు పాలకులకు తెలియనిది కాదు. పాలకుల కళ్ళకు 'సూపర్‌గా కన్పిస్తున్న' ఆసుపత్రిలో పరిస్థితి అధ్వాన్నంగా మారాయని సామాన్యులు చెబుతున్నారు.

**శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రిలో ఏం జరుగుతుంది?:**

శ్రీకాళహస్తిలో ప్రభుత్వం నిరుపేదల కోసం ఏర్పాటు చేసిన ఆసుపత్రిలో కొలువు చేస్తున్న ఉద్యోగులు తమ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. పాలకులు పరిశీలనకు వచ్చినపుడు ఘనంగా స్వాగతాలు పలుకుతూ శాలువాలు కప్పుతూ తిమ్మిని బిమ్మిని చేసి చూపుతూ ఆహా!ఓహో అనిపించుకుంటున్నారు. కానీ వాస్తవ పరిస్థితి గమనిస్తే ఇక్కడ కనీసం అటెస్టేషన్‌కు కూడా రేట్లు ఖరారు చేసి వసూలు చేసుకుంటున్నారనే ఆరోపణలున్నాయి. ఇక్కడ ఉద్యోగం వస్తే ఎంచక్కా తమ డిస్పెన్సరీల్లో కీనిక్‌లలో ప్రాక్టీసు చేసుకోవచ్చునని భావిస్తున్నారు. ఇక్కడ పని చేయాల్సిన అదికారి రోజూ తిరుపతి నుంచి రాకపోకలు. పట్టించుకునే దిక్కులేదు. సూపరింటెండెంట్ అయితే ఇక ఎసి గదికే పరిమితం. గతంలో ఇక్కడ పని చేసిన సూపరింటెండెంట్లు ఓపి చూసేవారు. దాంతో డాక్టర్లు కూడా ఓపి చూసే వారు.నేడు సూపరింటెండెంట్ అంటే 'సుప్రీం' ఆయన అజమాయిషీకే పరిమితం. ఆయనే డ్యూటీలు చేయనపుడు ఇక డాక్టర్లు ఏం పని చేస్తారు?గత మూడు సంవత్సరాలుగా పరిశీలిస్తే ఆసుపత్రిలో 'సీజర్లు' చేసిన సందర్భాలే లేదని చెప్పవచ్చు. ఇక్కడ కంటి ఆసుపత్రి ఉంది, ఇద్దరు డాక్టర్లున్నారు. కానీ వారి ఓపి ఏదో ఒక మూల ఏర్పాటు చేసుకొని ఎవరికి కనబడక ఉండటం గమనించదగ్గ విషయం.

**చెక్‌బుక్ ఎవరి వద్ద ఉండాలి?:**

శ్రీకాళహస్తిలోని ఏరియా ఆసుపత్రిలో పరిపాలనా తీరే వేరబ్బా అన్నట్లు మారింది. మంగళవారం బయటపడిన చెక్ పై ఫోర్జరీ సంతకానికి సంబంధించి సూపరింటెంటెండ్ డాక్టర్ మురళీ కృష్ణ పోలీసులకు పిర్యాదు చేసారు. అయితే ఈ ఫోర్జరీకి సంబంధించి 13 నెలల నుంచి కనబడలేదా? అయితే చెక్ బుక్ ఎవరి వద్ద ఉండాలి? దానికి బాధ్యులెవరు? సాధారణంగా చెక్‌బుక్‌లో చెక్ రాయాల్సివచ్చినపుడు అకౌంటెంట్ ఎఓతో చర్చిస్తారు. ఈ అంశాన్ని ఎఇ సూపరింటెండెంట్ దృష్టికి తీసుకెళతారు. మరి ఇన్ని దశలు ఉన్నపుడు సింపుల్‌గా నా సంతకం ఫోర్జరీ చేసారని ఫిర్యాదు చేయటం ఏమిటి? ఫోర్జరీ చేస్తే చిరుద్యోగులే బాధ్యులా? మరి ఎఓ ఏమైనట్లు? ఇలాంటి సందేహాలు పట్టణంలో చర్చనీయాంశంగా మారాయి. మార్చురిలో పోస్టు మార్టం చేసే ఉద్యోగిని కంప్యూటర్ ఆపరేటర్‌గా ఎందుకు నియమించుకున్నారు? ఇందులో ఆంతర్య మేమిటి? ఫోర్జరీ కి అర్థం ఏమిటి?ఆసుపత్రిలో ఎవరు డ్యూటీలు చేస్తున్నారు?

**ఎఫ్ఆర్ఎస్ ఎందుకు అమలు చేయరు :**

రాష్ట్రవ్యాప్తంగా ఆసుపత్రుల్లో వైద్యశాఖ ఆదేశాలతో ఎఫ్ఆర్ఎస్ చేసుకున్నారు. కానీ శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రిలో మాత్రం అమలు జరగటం లేదని తెలిసింది. జియో ఫేసింగ్ లేదు, తంబ్ ఇంప్రేషన్ అమలు జరగదు.కారణం తిరుపతి డాక్టర్లు తమ ఇళ్ళలోనే ఉంటూ సెల్‌ఫోన్లో జియో ఇక శ్రీకాళహస్తిలో ఉండే ఉద్యోగులు ఇళ్ళలో ఉంటూ ఆపరేటర్‌ను తమ చెప్పు చేతుల్లో ఉంచుకొని పబ్బం గడుపుకుంటున్నారు. అందుకే తమకు అనుకూలమైన సిబ్బందిని కంప్యూటర్ ఆపరేటర్లుగా నియమించుకుంటారు.ఈ నేపధ్యంలోని పిఎంలు చేయాల్సిన ఉద్యోగిని కంప్యూటర్ ఆపరేటర్‌గా ఉపయోగించుకుంటూ తమ తప్పిదాలను బయట పడకుండా వ్యవహరిస్తూ 'ఫోర్జరీ' చేసారంటూ ఫిర్యాదులు. అంటే శ్రీకాళహస్తి ఆసుపత్రిలో 'అధికారుల పాలన కన్నా కంప్యూటర్ ఆపరేటర్లదే రాజ్యమా'? అని జనం చర్చించుకుంటున్నారు.

## బంగారు నెమలి వాహనంపై...
# విహరించిన గణనాథుడు



కాణిపాకం, సెప్టెంబర్ 16 ప్రభాతవార్త: కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి వారి దేవస్థానంలో జరుగుతున్న స్వామివారి బ్రహ్మోత్సవాలలో భాగంగా బుధవారం రాత్రి ఉభయదేవేరులతో కలసి గణనాథుడు బంగారు నెమలి వాహనంపై కాణిపాకం గ్రామ పురవీధుల్లో విహరిస్తూ భక్తులను కటాక్షించారు. ఈ కార్యక్రమానికి కాణిపాకం, చినకాంపల్లె, కొత్తపల్లె, చిగరపల్లె, అగరంపల్లె, వడ్రాంపల్లె, దామరకుంట, కురప్పల్లె, గ్రామాదుల రెడ్డి వంశస్థులు ఉభయదారులుగా వ్యవహరించారు. ఈమేరకు వారు ఉదయం వరుస ఉభయం తీసుకురాగా అర్చకస్వాములు స్వామివారి మూలవిరాట్‌కు పంచామృతాభిషేకం నిర్వహించి చక్కగా అలంకరించి ధూపదీపనైవేద్యాలను సమర్పించి భక్తులకు దర్శనం కల్పించారు. అనంతరం వివిధరకాల పుష్పాలతో దేదీప్యమానంగా అలంకరించిన బంగారు నెమలివాహనంపై స్వామి అమ్మవార్లను వుంచి మంగళవాయిద్యాలు, వివిధ సాంస్కృతిక ప్రదర్శనల నడుమ ఘనంగా గ్రామ పురవీధుల గుండా ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ వి.మణినాయుడు, ఈఓ కె.పెంచల కిషోర్, డిప్యూటీ ఈఓ సాగర్‌బాబు, ఆలయ ప్రధాన అర్చకులు సోమశేఖర్ గురుకుల్, స్థానాచార్యులు, ఏఈఓ రవీంద్ర బాబు, స్థానిక మాజీ సర్పంచ్ శాంతిసాగర్‌రెడ్డి, ఎంపీటీసీ సుధీర్‌లతో పాటు ఉత్సవ ఉభయదారులు పాల్గొన్నారు.

# ఈనెల 21,22 తేదీల్లో సిఎం పర్యటన

**-సిఎం పర్యటనకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలి - జిల్లా కలెక్టర్**



కొత్తపేటలో బహిరంగ సభ ప్రాంతం పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్

కుప్పం, సెప్టెంబర్ 16 ప్రభాతవార్త: ఈనెల 21, 22 తేదీల్లో సిఎం చంద్రబాబునాయుడు కుప్పం విజయవంతానికి శాఖలు సమన్వయంతో పని చేయాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. బుధవారం జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ కడ పి.డి. వికాస్ మర్మత్‌తో కలసి సిఎం పర్యటన ప్రాంతాలు పరిశీలించారు. శాంతిపురం మండలం తుమ్మిశి వద్ద హెలిప్యాడ్ స్థలాన్ని పరిశీలించారు. స్థానిక కొత్తపేట ప్రాంతంలో నూతనంగా నిర్మించే ఆర్డీఒ, డిఎస్పీ కార్యాలయాల నిర్మాణ ప్రాంతాన్ని, సిఎం బహిరంగ సభ వేదిక ప్రాంతాన్ని పరిశీలించారు. అలాగే రాజీవ్ కాలనీ సమీపంలో నూతన ంగా నిర్మించే రైతు బజార్ నిర్మాణ ప్రాంతాన్ని కలెక్టర్ పరిశీలించి అధికారులకు తగు ఆదేశాలు ఇచ్చారు. అనంతరం జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ టెలీ కాన్ఫరెన్స్ ద్వారా సిఎం పర్యటన ఏర్పాట్లలో భాగంగా అధికారులకు తగు ఆదేశాలు, సూచనలు జారీ చేశారు. సిఎం బహిరంగసభ వద్ద గ్యాలరీ ఏర్పాటు చేయాలన్నారు. ప్రభుత్వ పథకాల్లో లబ్ధి పొందిన లబ్ధిదారులతో సిఎం ముచ్చటిస్తారన్నారు. హెచ్ఎన్ఎస్ఎస్, స్కిల్ డెవలప్‌మెంట్, వ్యవసాయ అనుబంధ రంగాల్లో లబ్ధి పొందిన వారి వివరాలు సిద్ధం చేయాలని ఆదేశించారు. శుక్రవారం నుంచి అధికారులు కుప్పంలో వారికి కేటాయించిన విధులు జాగ్రత్తగా చేపట్టాలన్నారు. భ ద్రత, ట్రాఫిక్ నియంత్రణ, తాగునీరు, పారిశుద్ధ్యం, విద్యుత్ సరఫరా, వైద్య సేవలు, వాహనాల పార్కింగ్, ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనలో అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి పర్యటన విజయవంతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్పీ బొడ్డు హేమంత్, పికెఎం ఉడా ఛైర్మన్ డాక్టర్ బిఆర్ సురేష్‌బాబు, సిఎం పిఎ శ్రీకాంత్, ఆర్డీఒ షేక్ మహ్మద్ హుసేన్, కమీషనర్ శ్రీనివాసరావు, రెస్కో ఎండి సోమశేఖర్, తహశీల్దార్ రమేష్‌బాబు, రూరల్ సిఐ మల్లేష్ యాదవ్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

17CTR 2:17CTR 2.qxd 9/17/2026 12:14 AM Page 1



## ఎస్ఎంసి కమిటీలకు ఎన్నికలకు నోటిఫికేషన్

**శాంతిపురం, సెప్టెంబర్ 16 ప్రభాతవార్త**

పాఠశాల మేనేజ్‌మెంట్ ఎన్నికలకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంతో మోడల్ స్కూల్‌లో ఎన్నికల నిర్వహణకు చర్యలు చేపట్టినట్లు ప్రిన్సిపాల్ లత తెలిపారు. ఈనెల 15న ఎస్ఎంసి ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల, 18న ఓటర్ల జాబితా ప్రదర్శన, 25న అభ్యంతరాల స్వీకరణ, 29న ఎస్ఎంసి సభ్యులు, ఛైర్మన్, వైస్‌ఛైర్మన్ ఎన్నిక, అదేరోజు మధ్యాహ్నం ఎస్ఎంసి సమావేశం జరుగుతుందన్నారు.

## ఎన్నికలు ప్రశాంతంగా జరగాలి

**రామకుప్పం, సెప్టెంబర్ 16 ప్రభాతవార్త**



త్వరలో జరగనున్న స్థానిక ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా రాజకీయ పార్టీలు సహకరించాలని ఎంపిడిఓ అశ్విని కోరారు. బుధవారం మండల కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రభుత్వం మూడంచెల విధానంలో ఎన్నికలు నిర్వహిస్తుందన్నారు. ఎలాంటి పొరబాట్లకు తావివ్వక ఎన్నికలు రాజ్యాంగ బద్ధంగా జరిగేలా రాజకీయ పార్టీలు సహకరించాలన్నారు. రిజర్వేషన్లు, నామినేషన్లు, అభ్యంతరాలు, స్వీకరణ తదితర అంశాలు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచుతామన్నారు. కార్యక్రమంలో రాజకీయ పార్టీల మండల అధ్యక్షులు వెంకటరమణ, రాణి జనార్ధనరెడ్డి, హరీష్, బాబురెడ్డి, నేతలు రాజసింహ, ఆంజనేయప్ప, రోహిణప్ప, అల్లిశీను, పవన్‌కుమార్, భాస్కర్ పాల్గొన్నారు.

## గణనాధుని సన్నిధిలో విజయనగరం ఎంపీ

**కాణిపాకం, ఆగస్టు 11 ప్రభాతవార్త:**

విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు బుధవారం కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ దర్శనార్థం వచ్చిన ఆయనకు ఆలయ ఏఈఓ రవీంద్రబాబు, అర్చకులు ఆలయ మర్యాదలతో ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం ఆయన స్వామివారి సేవలో పాల్గొన్నారు. అలాగే ఆయన శ్రీవీరాంజనేయస్వామి ఆలయం, నవగ్రహ ఆలయంలో కూడా ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఆయనకు ఆలయ వేద మండపంలో ఆశీర్వచనం చేసి స్వామివారి శేషవస్త్రాలను, తీర్థ, ప్రసాదాలను, చిత్రపటాన్ని అందజేశారు. ఈకార్యక్రమంలో సూపరెండెంట్ వాసు, టెంపుల్ ఇన్స్‌పెక్టర్ రవి తదితరులు పాల్గొన్నారు.

## శాశ్వత నిత్యాన్నదాన పథకానికి 1,62 లక్షలు విరాళం

**కాణిపాకం, సెప్టెంబర్ 16 ప్రభాతవార్త:**



కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామివారి దేవస్థానంలో అమలవుతున్న శాశ్వత నిత్యాన్నదాన పథకానికి ఓ భక్తుడు శనివారం లక్ష రూపాయలను విరాళంగా అందజేశారు. ఈమేరకు కడపకు చెందిన విజయ్‌కుమార్ అనే భక్తుడు శాశ్వత నిత్యాన్నదాన పథకంకు 1,62,242 రూపాయలను విరాళంగా అందజేశారు. దాతలు విరాళ మొత్తాన్ని కుటుంబసభ్యులతో కలసి ఆలయ సూపరెండెంట్ వాసుకు అందజేశారు. దాతలకు ఆలయ సం ప్రదాయం ప్రకారం స్వామివారి దర్శనం కల్పించి తీర్థ, ప్రసాదాలను అందజేశారు. ఈకార్యక్రమంలో దాత కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

## కాణిపాకం దేవస్థానంలో ఈఓ ఆకస్మిక తనిఖీలు





**కాణిపాకం, సెప్టెంబర్ 16 ప్రభాతవార్త:** కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామివారి దేవస్థానంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం ఆలయ ఈఓ కె.పెంచల కిషోర్‌లు దేవస్థానంలో ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ఈమేరకు ఆలయంలోని క్యూలైన్లు, లడ్డూపోటు, అన్నదాన భవన్ తదితర ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించారు. 100 రూపాయలు,150 రూపాయల క్యూలైన్లు వద్ద భక్తుల రద్దీని పరిశీలిస్తూ భక్తులతో మాట్లాడి సౌకర్యాల గురించి అడిగి తెలుకున్నారు. అలాగే దేవస్థానం అన్నదాన భవన్‌ను ఆయన తనిఖీ చేశారు. ఈసందర్భంగా భక్తులకు వడ్డించే అన్న ప్రసాదాల నాణ్యత, అన్నదాన భవన్‌లో పరిశుభ్రతను పరిశీలించారు. అనంతరం అన్నదాన భవన్‌లో తనిఖీలు నిర్వహించి అన్నప్రసాదాల నాణ్యతను పరిశీలించారు.అలాగే భక్తులకు స్వయంగా అన్నప్రసాదాలను వడ్డిస్తూ అన్నప్రసాదాల నాణ్యతపై భక్తులను అడిగి తెలుసుకున్నారు. ఈకార్యక్రమంలో అన్నదానం ఏఈఓ హరిమాధవరెడ్డి, ఇన్‌చార్జి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## కుప్పంలో గేట్స్ ఫౌండేషన్ ఎస్‌పిఓ పర్యటన

**- ప్రకృతి వ్యవసాయ ఇంక్యుబేషన్ సెంటర్ సందర్శన !!**



**కుప్పం, సెప్టెంబర్ 16 ప్రభాతవార్త:** గేట్స్ ఫౌండేషన్‌కు చెందిన సీనియర్ ప్రాజెక్ట్ అధికారి సిద్ధార్థ చతుర్వేది బుధవారం కుప్పంలో పర్యటించారు. మండలంలోని గణేష్‌పురం వద్ద ఏర్పాటుచేసిన ప్రకృతి వ్యవసాయం ఇంక్యుబేషన్ సెంటర్‌ను ఆయన సందర్శించారు. అక్కడ గేట్స్ ఫౌండేషన్ సహకారంతో జరుగుతున్న ట్రేసబులిటీ, డ్రోన్ స్ప్రేయింగ్, సీడ్ పెలెటైజేషన్, ఆర్‌జిహెచ్ కార్యక్రమాలపై ఎఎంసి ఛైర్మన్ జిఎం రాజు, ఎపిసిఎన్ఎఫ్ డిపిఎం అమృతవల్లి, నోడల్ అధికారి బాజీబాబుతో చర్చించారు. ఈసందర్భంగా రైతులకు ఎలాంటి ఆదాయం వస్తోందనే అంశంపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎఎంసి ఛైర్మన్ జిఎం రాజు మాట్లాడుతూ గేట్స్ ఫౌండేషన్ తమ సహకారాన్ని మరిన్ని గ్రామాలు, మండలాలకు విస్తరించి ఎక్కువమంది రైతులకు లబ్ది కలిగేలా చూడాలని కోరారు. అనంతరం రామకుప్పం మండలం పెద్దగానూరులో బిఆర్‌సి సెంటర్‌కు అనుసంధానంగా రైతులు చేపట్టిన ఎ గ్రేడ్ ఎటిఎం మోడల్‌ను పరిశీలించారు. కుప్పం మండలం చందం గ్రామంలో వరిపంటకు డ్రోన్ స్ప్రేయింగ్‌కు పరిశీలించారు. కార్యక్రమంలో అథేనా ఇన్ఫోనోమిక్స్ ప్రతినిధులు సౌమ్య, నరేంద్ర, రైతులు పాల్గొన్నారు.

## ఐకమత్యంతో పనిచేసి గెలుపు సాధిద్దాం

**- కడ సభ్యుడు రాజ్‌కుమార్**



**కుప్పం, సెప్టెంబర్ 16 ప్రభాత వార్త :** సిఎం చంద్రబాబు నాయుడు ఆదేశాలతో పార్టీ నాయకులు, కార్యకర్తలు ఐకమత్యంతో పనిచేసి ఎన్నికల్లో గెలుపు సాధిద్దామని కడ సభ్యుడు రాజ్‌కుమార్ పేర్కొన్నారు. బుధవారం టిడిపి మున్సిపల్ అధ్యక్షుడు కాణిపాకం వెంకటేష్ అధ్యక్షతన మున్సిపల్ టిడిపి సమావేశం స్థానిక పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. ఈసందర్భంగా త్వరలో జరిగే మున్సిపల్ ఎన్నికలు, పార్టీ బలోపేతం తదితర అంశాలపై సమావేశంలో చర్చించారు. కార్యక్రమంలో సిఎం పిఎ శ్రీకాంత్, మున్సిపల్ ఛైర్మన్ సెల్వరాజ్, మాజీ మునిసిపల్ ఛైర్మన్ డాక్టర్ సుధీర్, మాజీ సర్పంచ్ గోపీనాథ్, కార్పొరేషన్ డైరెక్టర్ వేణుగోపాల్, ప్రధాన కార్యదర్శి నబీ, కౌన్సిలర్ జిమ్‌దాము, నేతలు సత్యేంద్రశేఖర్, డికెపల్లి మణి, శారదమ్మ, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

## సెల్ టవర్ ఎక్కిన యువకుడు..దింపిన గ్రామస్తులు

**కుప్పం, సెప్టెంబర్ 16 ప్రభాతవార్త :** మండలంలోని అడవిబూదుగూరు గ్రామంకు చెందిన ఓ యువకుడు గ్రామంలో ఉన్న సెల్ టవర్ ఎక్కేశాడు. ఇది గమనించిన స్థానికులు ఫైర్ అధికారులకు సమాచారం అందించారు. అనంతరం యువకుడ్ని గ్రామస్తులు నచ్చజెప్పి కిందకు దించారు. ఈ విషయంగా గ్రామస్తులు మాట్లాడుతూ అతను తరచూ ఇలాగే వ్యవహరిస్తుంటాడని అతని పరిస్థితి అప్పుడప్పుడూ బాగుండదని గ్రామస్తులు తెలిపారు.

## పిఇఎస్ స్టాఫ్ క్వార్టర్స్‌లో భారీ పాము ప్రత్యక్షం

**కుప్పం, సెప్టెంబర్ 16 ప్రభాతవార్త:** పిఇఎస్ వైద్య కళాశాలలో ఉన్న స్టాఫ్ క్వార్టర్స్‌లో బుధవారం ఓ భారీ పాము ప్రత్యక్షమైంది. దీన్ని చూసిన సిబ్బంది భయభ్రాంతులకు గురయ్యారు. విషయాన్ని ఆస్పత్రి అధికారులకు తెలియజేయగా వారు కుప్పం అటవీ శాఖ అధికారులకు సమాచారం ఇవ్వడంతో అటవీ అధికారులు సిబ్బంది సహకారంతో భారీ పామును పట్టుకుని సమీప అటవీ ప్రాంతంలో వదిలిపెట్టారు. పట్టుకున్న పాము రక్తపింజరి అని సుమారు ఏడు అడుగుల పొడవు ఉంటుందని డిఆర్వో సమీర్ బాషా తెలిపారు.పామును నడిమూరు అటవీ ప్రాంతంలో వదిలిపెట్టినట్లు చెప్పారు. పామును అటవీ అధికారులు పట్టుకోవడంతో పిఇఎస్ సిబ్బంది ఊపిరి పీల్చుకున్నారు.

## ప్రశాంత వాతావరణంలో ఎన్నికలకు సహకరించాలి

**కుప్పం, సెప్టెంబర్ 16 ప్రభాతవార్త**




త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా రాజకీయ పక్షాలు సహకరించాలని ఎంపిడిఓ రాజేంద్ర ప్రసాద్ కోరారు. బుధవారం స్థానిక మండల కార్యాలయంలో మండలంలోని పోలింగ్ కేంద్రాల ఏర్పాటుపై రాజకీయ పక్షాల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఒక్కో వార్డుకు ఒక్కో పోలింగ్ బూత్‌ను ఏర్పాటుచేయడం జరుగుతుందన్నారు.పోలింగ్ బూత్‌లపై ఏదేని అభ్యంతరాలు ఉంటే రాతపూర్వకంగా తెలియజేయవచ్చన్నారు. ఇప్పటికే మండలంలోని 29 పంచాయతీల పరిధిలో ఉన్న ఓటర్ల జాబితాను సైతం ఉన్నతాధికారుల ఆదేశాలతో ప్రకటించడం జరిగిందన్నారు. సమావేశంలో రాజకీయ పక్షాల నేతలు తులసినాథ్, ధనశేఖర్, శరవణ,ఈశ్వర్, మునస్వామి, ఇమ్రాన్, ఇనాయతుల్లా, డిప్యూటీ ఎంపిడిఓ విజయ్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## తెదేపాలోకి పది కుటుంబాలు చేరిక

**కుప్పం, సెప్టెంబర్ 16 ప్రభాతవార్త**



మండలంలోని మిట్టపల్లి గ్రామంలో బుధవారం వైకాపాకు చెందిన పది కుటుంబాలు ఆపార్టీని వీడి తెలుగుదేశం పార్టీలో చేరారు. వీరికి టిడిపి మండల అధ్యక్షుడు రాజగోపాల్, ఎపిఐఐసి డైరెక్టర్ ప్రేమ్‌కుమార్, జిల్లా అధికార ప్రతినిధి సాంబశివం, క్లస్టర్ ఇన్‌చార్జ్ హైదర్ వలీ పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి సాదర ంగా ఆహ్వానించారు. సిఎం చంద్రబాబు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమాలు చూసి తాము పార్టీలో చేరుతున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో కడ సభ్యుడు రామచంద్ర, కురబసంఘ అధ్యక్షుడు లీలా వెంకటేష్, సీనియర్ నేత చలపతి, కార్పొరేషన్ డైరెక్టర్ మణి, రెస్కో డైరెక్టర్ హరోగరన్, మాజీ సర్పంచ్ సంతోష్ పాల్గొన్నారు.

## అన్ని పంచాయతీల్లో గెలుపే లక్ష్యం

**- టిడిపి మండల అధ్యక్షుడు రాజగోపాల్**

**కుప్పం, సెప్టెంబర్ 16 ప్రభాతవార్త**



త్వరలో జరిగే స్థానిక ఎన్నికల్లో సిఎం చంద్రబాబునాయుడు ఆదేశాలతో అన్ని పంచాయతీల్లోను గెలుపే లక్ష్యంగా పార్టీ శ్రేణులు కష్టించి పనిచేద్దామని టిడిపి మండల అధ్యక్షుడు రాజగోపాల్ కోరారు. బుధవారం మిట్టపల్లిలో జరిగిన సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. సిఎం చంద్రబాబు అమలు చేస్తున్న సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలు ప్రతి ఇంటికీ తీసుకెళ్లి ప్రజలకు వివరించాలన్నారు. గ్రామాల్లో పార్టీ బలోపేతంకు నేతలు కృషి చేయాలన్నారు. పార్టీ శ్రేణులు ఐకమత్యంతో, సమన్వయంతో పనిచేసి పార్టీ అభ్యర్థుల గెలుపుకు సహకరించాలని కోరారు. గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారంకు కృషి చేయాలని కోరారు. సమావేశంలో ఎపిఐఐసి డైరెక్టర్ ప్రేమ్‌కుమార్, జిల్లా అధికార ప్రతినిధి సాంబశివం, క్లస్టర్ ఇన్‌చార్జ్ హైదర్ వలీ ,కడ సభ్యుడు రామచంద్ర, కురబసంఘ అధ్యక్షుడు లీలా వెంకటేష్, సీనియర్ నేత చలపతి, కార్పొరేషన్ డైరెక్టర్ మణి, రెస్కో డైరెక్టర్ హరోగరన్, మాజీ సర్పంచ్ సంతోష్ పాల్గొన్నారు.

## కుప్పం డివిజన్‌లో 30 పోలీస్ యాక్ట్

**కుప్పం, సెప్టెంబర్ 16 ప్రభాతవార్త**

కుప్పం పోలీస్ సబ్ డివిజన్ పరిధిలో 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉందని ఎస్పీ కార్యాలయం ఓ ప్రకటనలో పేర్కొంది. 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉండడంతో ఎలాంటి ముందస్తు అనుమతులు లేకుండా సభలు, సమావేశాలు, ర్యాలీలు, ఇతర బహిరంగ కార్యక్రమాలు నిర్వహించరాదన్నారు. అలా నిర్వహిస్తే చట్ట ప్రకారం సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకోబడతాయన్నారు. పోలీసు శాఖకుఈ విషయంగా సహకరించాలని పేర్కొన్నారు.

## తెదేపా కార్యకర్త మృతి..ఆర్థికసాయం



**గుడుపల్లె, సెప్టెంబర్ 16 ప్రభాతవార్త**

మండలంలోని సాలచింతనపల్లికి చెందిన మునెప్ప అనే టిడిపి కార్యకర్త మృతి చెందాడు. బుధవారం సిఎం పిఎ శ్రీకాంత్, కార్పొరేషన్ డైరెక్టర్ బాబునాయుడు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. అంత్య క్రియల నిమిత్తం పదివేల ఆర్థికసాయం అందించారు.

## అభివృద్ధి..సంక్షేమాలు ప్రజలకు వివరించాలి - ఆర్టీసీ వైస్‌ఛైర్మన్ పిఎస్ మునిరత్నం

**గుడుపల్లె, సెప్టెంబర్ 16 ప్రభాతవార్త**



సిఎం చంద్రబాబునాయుడు అమలు చేస్తున్న సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలు ప్రజల్లో విస్తృతంగా తీసుకెళ్లాలని ఆర్టీసీ వైస్‌ఛైర్మన్ పిఎస్ మునిరత్నం పేర్కొన్నారు. బుధవారం గుడుపల్లె మండల స్థాయి పార్టీ సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. త్వరలో జరిగే స్థానిక ఎన్నికలకు పార్టీ శ్రేణులు సమాయత్తం కావాలని పిలుపునిచ్చారు. మండలంలో అన్ని చోట్ల కూటమి అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా సమన్వయంతో నేతలు, కార్యకర్తలు కలసి పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో కన్వీనర్ ఆర్.చంద్రశేఖర్, ఎఎంసి ఛైర్మన్ జిఎం రాజు, మండల అధ్యక్షుడు సుబ్బు, క్లస్టర్ ఇన్‌చార్జ్ బేటప్పనాయుడు, కార్పొరేషన్ డైరెక్టర్ బాబు, నేతలు హేమాంబరగౌడు, ఎల్లప్ప, ఎస్ఆర్ చంద్ర, వెంకటేష్, సురేష్, చంద్రన్న తదితరులు పాల్గొన్నారు.

## శాంతిపురం యూత్‌చే రక్తదాన శిబిరం

**శాంతిపురం, సెప్టెంబర్ 16 ప్రభాతవార్త**




శ్రీ వరసిద్ది వినాయక స్వామి ఉత్సవాల్లో భాగంగా స్థానిక శివాలయం వీధి, కెజిఎఫ్‌రోడ్‌కు చెందిన యూత్ అధ్వర్యంలో రక్తదాన శిబిరం, బ్లడ్ గ్రూప్ నిర్ధారణ శిబిరాన్ని నిర్వహించారు. సుమారు ఇరవై మంది యువకులు రక్తదానం చేశారు. మరో రెండు వందలమందికి శ్రీతనూజ రక్తపరీక్ష కేంద్రం వారిచే ఉచితంగా బిపి, చక్కెర వ్యాధి, బ్లడ్ గ్రూప్ పరీక్షలు జరిపారు. కార్యక్రమంలో వైద్యులు మురళి, సల్మా, ఎల్‌టి సుబ్రమణ్యం, కోకిల పాల్గొన్నారు. కాగా వినాయక మండపం వద్ద నిత్యం అన్నదానం, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు పలమనేరు, కుప్పం,

## అర్ధరాత్రి పొలాల్లోకి ఏనుగుల గుంపు రెండు ఎకరాల్లో పంట ధ్వంసం

**వి.కోట, సెప్టెంబరు 16 ప్రభాతవార్త:**



మండలంలోని గోనుమాకులపల్లి పంచాయతీ పరిధి చిన్నశ్యామ గ్రామంలో ఏనుగుల గుంపు బీభత్సం సృష్టించింది.మంగళవారం అర్ధరాత్రి అటవీ ప్రాంతం నుంచి జనావాసాల్లోకి వచ్చిన 67 ఏనుగుల గుంపు పంట పొలాలను ధ్వంసం చేసింది. గ్రామానికి చెందిన రైతు నీలమ్మకు చెందిన రెండెకరాల పొలంలోకి ప్రవేశించిన ఏనుగులు కోతకు సిద్ధంగా ఉన్న వరి పంటతో పాటు టమోటా,బొప్పాయి తోటలను తొక్కి నేలమట్టం చేశాయి.వేల రూపాయలు వెచ్చించి సాగు చేసిన పంట ఒక్క రాత్రిలో నాశనం కావడంతో బాధిత రైతు కన్నీరు మున్నీరవుతోంది.ఇటీవల ఏనుగుల సంచారం ఎక్కువైందని,రాత్రి వేళల్లో పొలాల వద్దకు వెళ్లాలంటే భయంగా ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ప్రభుత్వం పంట నష్టాన్ని అంచనా వేసి నష్ట పరిహారం చెల్లించాలని,ఏనుగులు రాకుండా శాశ్వత చర్యలు,కంచెలు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.సమాచారంఅందుకున్నఅటవీశాఖఅధికారులుబుధవారం ఉదయం ఘటనా స్థలాన్ని పరిశీలించారు.

## వినాయక నిమజ్జనం హిందూ,ముస్లిం ఐక్యతకు నిదర్శనం

**వి.కోట, సెప్టెంబరు 16 ప్రభాతవార్త:**



వినాయక చవితి వేడుకల్లో భాగంగా మూడో రోజు వి.కోట పట్టణంలో నిమజ్జనానికి బయలుదేరిన వినాయక విగ్రహాల ఊరేగింపు ప్రశాంతంగా, భక్తిశ్రద్ధలతో జరిగింది.చిత్తూరు జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా వి.కోట అర్బన్ సీఐ ఆర్.సోమశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.ట్రాఫిక్ కు అంతరాయం కలగకుండా విగ్రహాలను ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా నిమజ్జనానికి తరలించారు.ఈ నిమజ్జన కార్యక్రమంలో వి.కోటలో హిందూముస్లిం భాయ్ భాయ్ అంటూ మతసామరస్యం వెల్లివిరిసింది. ఊరేగింపులో పాల్గొన్న భక్తులకు ముస్లిం సోదరులు మంచినీటి బాటిళ్లు,జ్యూస్ ప్యాకెట్లు,పండ్లను స్వయంగా అందించి సోదరభావాన్ని చాటుకున్నారు. ఇరు వర్గాల ప్రజలు కలిసిమెలిసి పాల్గొనడంతో వేడుక మరింత శోభాయమానంగా సాగింది.నిమజ్జనం కోసం పత్రపల్లి చెరువు వద్ద రెండు క్రేన్లు, నలుగురు గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచారు.విద్యుత్ దీపాలతో అన్ని ఏర్పాట్లను పంచాయతీ ఈవో నరేష్ దగ్గరుండి పర్యవేక్షించారు. పోలీసు శాఖ,స్థానికుల సహకారంతో నిమజ్జన కార్యక్రమం ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రశాంతంగా ముగిసింది.

## స్థానిక సంస్థల ఎన్నికలకు సన్నద్ధం

**పెనుమూరు, సెప్టెంబర్ 16 ప్రభాతవార్త:**



త్వరలో జరుగనున్న స్థానిక సంస్థల ఎన్నికలకు నాయకులు, కార్యకర్తలు సన్నద్ధం కావాలని మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు పెద్దినేని రుద్రయ్యనాయుడు పిలుపునిచ్చారు. పెనుమూరులోని మండల తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో బుధవారం మండల తెలుగుదేశం పార్టీ విస్తృత సమావేశం జరిగింది. ఈ సమావేశంలో మండల దేశం అధ్యక్షులు పెద్దినేని రుద్రయ్యనాయుడు మాట్లాడుతూ గత రెండేళ్ళలో కూటమి ప్రభుత్వం చేపట్టిన ప్రజా సంక్షేమ పథకాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లడానికి కార్యకర్తలు కృషి చేయాలన్నారు. అలాగే పార్టీ నాయకులు, కార్యకర్తలు ఐక్యత, సమన్వయం, క్రమశిక్షణతో మెలగాలని, పార్టీ భవిష్యత్తు దృష్ట్యా సిఎం నారా చంద్రబాబునాయుడు ప్రజా సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్ళులాగా సమన్వయంతో రాష్ట్రంను ప్రగతి పథంలో నడిపిస్తున్నారన్నారు. మనం చేసిన అభివృద్ధిని గ్రామాల్లోకి వెళ్ళి ప్రజలకు వివరించాలని, తద్వారా ప్రజలే స్వచ్ఛంధంగా పార్టీ పట్ల ఆకర్షితులై కూటమి ప్రభుత్వానికి అండగా వుంటారని ఆశాభావం వ్యక్తం చేశారు. గత వైకాపా ప్రభుత్వం రాష్ట్రంను విధ్వంసం చేసిందని, కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన రెండేళ్ళలో సిఎం నారా చంద్రబాబునాయుడు రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని గాడిలో పెట్టి రాష్ట్రంను అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో జడ్పీటీసీ, ఎంపిటీసీ, సర్పంచ్ అభ్యర్థులందరినీ గెలిపించే బాధ్యతలను పార్టీ నాయకులు, కార్యకర్తలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో దేశం నాయకులు తలారి రెడ్డప్ప, ఎన్ఎస్ నాయుడు, పంగులూరు కిషోర్‌నాయుడు, చల్లం పాల్యం గుర్రప్ప తదితరులు పాల్గొన్నారు.

## పక్కాగా సేవా సంకల్ప అభియాన్

**- జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నాగ శశిభూషణ్‌రెడ్డి**

**చిత్తూరు, సెప్టెంబర్ 16 ప్రభాతవార్త:**



ప్రధాని నరేంద్రమోడి ప్రజా జీవితంలో 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా నిర్వహిస్తున్న సేవా సంకల్ప అభియాన్ కార్యక్రమంను పక్కాగా నిర్వహించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నాగ శశిభూషణ్‌రెడ్డి అన్నారు. డిఎంహెచ్ఓ డాక్టర్ నాగ శశిభూషణ్‌రెడ్డి బుధవారం సేవా సంకల్ప అభియాన్ కార్యక్రమంపై వైద్యాధి కారులు, సూపర్‌వైజర్లు, సిబ్బందితో జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించి సమీక్షించారు. ఈ సందర్భంగా డిఎంహెచ్ఓ మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని ప్రతి గ్రామంలో ప్రత్యేక వైద్య శిబిరాలు, ఆరోగ్య అవగాహన కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో మాతా శిశు సంరక్షణ, చైల్డ్‌హెల్త్, ఆర్‌బిఎస్‌కె, ఎన్‌సిడి, కమ్యూనికల్ డిసిజెస్, రక్తదానం, కంటి, చెవి వైద్యశిబిరాలతో పాటు ప్రజలకు అవసరమైన ఇతర ఆరోగ్య కార్యక్రమాలపై ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించాలని వైద్యాధికారులను ఆదేశించారు. సెప్టెంబర్ 17 నుండి అక్టోబర్ 17 వరకు నెల రోజుల పాటు ఈ కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఈ జూమ్ కాన్ఫరెన్స్‌లో ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ అనిల్‌కుమార్, డాక్టర్ గిరి, డాక్టర్ అనూష, రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## పిజిఆర్ఎస్ ఫిర్యాదులకు సత్వర పరిష్కారం

**- క్షేత్ర స్థాయిలో సమస్యలను పరిశీలించి అధికారులను ఆదేశించిన జడ్పీ సిఇఓ**

**చిత్తూరు, సెప్టెంబర్ 16 ప్రభాతవార్త:**




ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజల నుండి సమస్యలపై అందిన అర్జీలను క్షేత్ర స్థాయిలో పరిశీలించి ఫిర్యాదులను సత్వరం పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని జడ్పీ సిఇఓ రవికుమార్‌నాయుడు అధికారులను ఆదేశించారు. జడ్పీ సిఇఓ రవికుమార్‌నాయుడు బుధవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో బంగారుపాళ్యం మండలం, బంగారుపాళ్యం పంచాయతీ పరిధిలో ఓ స్థల సమస్యపై పిజిఆర్ఎస్‌లో అందిన ఫిర్యాదుపై క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ సమస్యను సత్వరం పరిశీలించి పరిష్కరించి చర్యలు తీసుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి సుధాకర్‌రావు, స్థానిక పంచాయతీ కార్యదర్శిని జడ్పీ సిఇఓ ఆదేశించారు. అలాగే యాదమరి మండలం క్రిష్ణంపల్లి గ్రామ పంచాయతీలో అంగన్‌వాడీ భవన నిర్మాణానికి సంబంధించి బిల్లులు చెల్లించలేదని పిజిఆర్ఎస్‌లో అందిన ఫిర్యాదును జడ్పీ సిఇఓ పరిశీలించి సమస్యను సత్వరం పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అనంతరం జడ్పీ సిఇఓ యాదమరి మండల పరిషత్ కార్యాలయంలో రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో పోలింగ్ స్టేషన్ల ఏర్పాటుపై వచ్చిన ఫిర్యాదులను జడ్పీ సిఇఓ పరిశీలించారు. రాజకీయ పార్టీల తరపున అందిన ఫిర్యాదులను పరిశీలించి ఎన్నికల కమీషన్ మార్గదర్శకాల మేరకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

## అన్నిస్థానాల్లో గెలుపు సాధించాలి - సిఎం పిఎ శ్రీకాంత్

**రామకుప్పం, సెప్టెంబర్ 16 ప్రభాతవార్త**



త్వరలో జరిగే స్థానిక ఎన్నికల్లో అన్ని స్థానాల్లో గెలుపు సాధించాలని సిఎం పిఎ శ్రీకాంత్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక తెదేపా కార్యాలయంలో ఆయన నాయకులతో సమావేశమయ్యారు. పార్టీ శ్రేణులు సమన్వయంతోపనిచేసిఎంపిటిసి, జడ్పీటిసి, అన్ని సర్పంచుల స్థానాలు గెల వాలన్నారు. కార్యక్రమంలో నేతలు మునస్వామి, వెంకటరమణ, పత్ర నారాయణ, నరసింహులు, కామరాజునాయక్, రఫీ, రవిరెడ్డి, రఘు, ఆదిల్ పాల్గొన్నారు.

# అభివృద్ధిపై చర్చకు మేము సిద్ధం!

## - ప్రజా కోర్టులో తేల్చుకుందాం - మాజీ ఎంపీ నెలవల

సూళ్లూరుపేట, సెప్టెంబర్ 16 ప్రభాతవార్త: నియోజకవర్గంలో రెండున్నర సంవత్సర కాలంలో చేసిన అభివృద్ధిపై, గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన అభివృద్ధి పనులపై చర్చకు సిద్ధమని మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం అన్నారు. బుధవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య నిరాధార ఆరోపణలు చేస్తూ అభివృద్ధి చేస్తున్న ఎమ్మెల్యేని ఇబ్బంది పెట్టాలని చూస్తున్నారని వాటన్నిటిని లెక్క చేసే ప్రసక్తి లేదని ఆయన తెలిపారు. ఎన్నికల కోసం ప్రస్తుతం సంజీవయ్య చేస్తున్న డ్రామాలను ప్రజలు గమనిస్తున్నారని రాబోయే ఎన్నికల్లో ప్రజాక్షేత్రంలో తగిన బుద్ధి చెబుతారని ప్రజలు ఇచ్చే తీర్పును తాము శిరసా వహిస్తామన్నారు. తాటాకు చెప్పులు చేసే మాజీ ఎమ్మెల్యే ఆరోపణలకు భయపడే లేదన్నారు. కాళంగి వంతెన నిర్మాణ విషయంలో గత ప్రభుత్వ హయాంలో 35 కోట్లతో జీవో తెచ్చిన మాట వాస్తవమేనని కానీ ఆ జీవో ఆర్థికపరమైన మంజూరులు లేకపోవడంతో నిలిచిపోయాయన్నారు. నవంబర్లో జియో వస్తే ఎందుకు కనీసం టెండర్లు పిలిచి పనులు మొదలు పెట్టలేదని నెలవల ప్రశ్నించారు. గతంలో తాము చిగురుపాడు, భీమవరం గ్రామాలకు సంబంధించి రోడ్లను మంజూరు చేస్తే వాటిని క్యాన్సిల్ చేయించిన ఘనత సంజీవయ్యకే దక్కుతుందన్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ ఆధ్వర్యంలో ఈ రోడ్లకు ప్రభుత్వం నుండి నిధులు మంజూరు చేయించి చిగురుపాడు రోడ్డును పూర్తిచేసి ప్రారంభం చేయడం జరిగిందన్నారు. ఇప్పటివరకు నెలవల విజయశ్రీ ఆధ్వర్యంలో నియోజకవర్గంలో 250 కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులను చేపట్టడం జరిగిందని వివరించారు. కొరిడి పేర్నాడు రోడ్డుకు సంబంధించి 65 లక్షల రూపాయల నిధులను మరమ్మతుల కోసం మంజూరు చేయించిందన్నారు. గత కొన్ని సంవత్సరాలుగా తెలుగు



గంగ నీటి కోసం ప్రయత్నాలు చేస్తున్న ఎమ్మెల్యే పొరవతో రెండు టిఎంసీల నీటిని కాళంగి, స్వర్ణముఖి నదులకు విడుదల చేయడం జరిగిందని తెలిపారు. కాళంగి నదివంతెనకు సంబంధించి ప్రస్తుతం 23 కోట్ల రూపాయలతో నూతనంగా ప్రతిపాదనలు సిద్ధం చేయడం జరిగిందని వీటన్నిటికీ అతి త్వరలో ప్రభుత్వం నుండి అనుమతి లభించ నున్నట్లు నెలవల సుబ్రహ్మణ్యం తెలిపారు. సగుటూరు చెరువు విషయంలో లేనిపోని రాద్ధాంతం చేస్తున్నారని దీనిపై ఎటువంటి విచారణకైనా తాము సిద్ధంగా ఉన్నట్లు ఆయన పేర్కొన్నారు. ఐదేళ్ల కాలంలో రోడ్లపై తట్ట మట్టి వేయని వారు కూడా ప్రస్తుతం నీతులు చెప్పడం విడ్డూరంగా ఉందని ఆయన అన్నారు. మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య విజి టింగ్ ప్రొఫెసర్ వస్తూ టైంపాస్ ఆరోపణలు చేస్తే పట్టించుకునేది లేదని ఆయన అన్నారు. ఈ సమావేశంలో టిడిపి నేతలు తిరుమూరు సుధాకర్ రెడ్డి, ఆకుతోట రమేష్, ఏజీ కిషోర్, బొమ్మన శ్రీధర్,పాకం వెంకటసుబ్బయ్య, పచ్చ మాధవ నాయుడు, సెల్వం తదితరులు పాల్గొన్నారు.

# పోలేరమ్మ జాతరకు...రాజాల అనుమతి తీసుకున్న నిర్వాహకులు



బాలాయపల్లి, సెప్టెంబర్ 16 ప్రభాతవార్త: శక్తి స్వరూపిణి పోలేరమ్మ అమ్మవారి జాతర ఈనెల 30, అక్టోబర్ నెల ఒకటో తేదీ జరుగుతున్నడంతో నిర్వహించేందుకు రాజాల అనుమతి తీసుకున్న ఆలయం ఈవో ఆర్వభూమి వెంకట శ్రీనివాసులురెడ్డి, జాతర కమిటీ సభ్యులు. జాతర ప్రశాంతంగా నిర్వహించాలని రాజవంశస్తులు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ విబి సాయి కృష్ణ యాచేంద్ర ఆలయం ఈవో శ్రీనివాసులు రెడ్డికి, కమిటీ సభ్యులకు పూలమాలలు వేసి తాంబూలాలు అందించారు. ప్రతి సంవత్సరం సాంప్రదాయబద్ధంగా రాజాల అనుమతిని తీసుకుంటారు. రాజాల నివాసంలో పోలేరమ్మ ఈవో, కమిటీ సభ్యులకు పూలమాలలు వేసి జాతర నిర్వహణకు అనుమతి ఇచ్చారు. ప్రశాంతంగా పోలేరమ్మ జాతరను నిర్వహించాలని మాజీ ఎమ్మెల్యే సాయి కృష్ణ యాచేంద్ర తెలిపారు. అమ్మవారి కృపాకటాక్షాలు అందరిపై ఉండాలని చెప్పారు. ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ సారథ్యంలో అధికార యంత్రాంగం జాతరను విజయవంతంగా నిర్వహించాలని తెలిపారు. ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని కోరారు. అందరి సహాయ సహకారాలతో జాతరను విజయవంతంగా నిర్వహిస్తామని ఆలయం ఈవో శ్రీనివాసులు రెడ్డి తెలిపారు. పోలీసులు, అధికారులు, ఆలయ కమిటీ సభ్యులు అందరూ సహాయ సహకారాలను జాతరకు తీసుకుంటామని తెలిపారు. ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ సూచనలు, సలహాలతో జాతర నిర్వహిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో జాతర నిర్వహణ కమిటీ సభ్యులు గొల్లగుంట మురళీకృష్ణ, తాండవ చంద్రశేఖర్, అనిల్, చెంజి తిరుపాల్రెడ్డి, మాజీ కౌన్సిలర్ ఢిల్లీ బాబు, ఎం ఏ నారాయణ, ధనియాల రాధా, ఆవుల వెంకటేశ్వరరావు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా పోలేరమ్మ జాతరను నిర్వహిస్తాం : ఎమ్మెల్యే



బాలాయపల్లి, సెప్టెంబర్ 16 ప్రభాతవార్త: గ్రామ శక్తి స్వరూపిణి పోలేరమ్మ అమ్మవారి జాతర వైభవంగా నిర్వహిస్తామని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ తెలిపారు. పోలేరమ్మ జాతర కమిటీ, జాతర సేవకులతో ఆయన సమావేశం నిర్వహించారు. తాను 13 సంవత్సరాల నుండి ఎమ్మెల్యేగా పోలేరమ్మ జాతర నిర్వహించాలని తెలిపారు. సామాన్య భక్తుల దర్శనానికి మొదటి ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా ఏర్పాట్లు చేయిస్తామని తెలిపారు. పోలేరమ్మ జాతర ఏర్పాట్లపై అధికారులతో త్వరలో సమావేశం నిర్వహిస్తామని తెలిపారు. ఎమ్మెల్యే రామకృష్ణను సేవా కమిటీ వారు ఘనంగా సన్మానించారు. ఈ సమావేశంలో ఆలయం ఈవో శ్రీనివాసులు రెడ్డి, సేవా కమిటీ సభ్యులు మురళీకృష్ణ, తాండవ చంద్రారెడ్డి, చెంజి తిరుపాల్రెడ్డి, వెంకట కృష్ణయ్య, మాజీ ఏఎంసీ చైర్మన్ రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపాలిటిపై తెలుగుదేశం జెండా ఎగరాల్సిందే!

## -అభ్యర్థి ఎవరైనా విజయం మనదే

**కావాలి: ఎంఎల్ఏ**



శ్రీకాళహస్తి,సెప్టెంబర్ 16 ప్రభాతవార్త: రాబోవు స్థానిక సంస్థల ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ కూటమి పార్టీలతో సమన్వయంతో పని చేసి విజయం సాధించాలని శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్రెడ్డి ద్వితీయ శ్రేణి నాయకులు,కార్యకర్తలనుద్దేశించి పిలుపు నిచ్చారు. పార్టీ కార్యాలయంలోని ఎన్టిఆర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమాలలో శాసనసభ్యుడు సుధీర్రెడ్డి పార్టీ ఆదేశాలను కార్యకర్తలకు వివరించారు.కూటమి ఒరెండున్నర సంవత్సరాల్లో ఎన్నో ప్రగతి పనులతో పాటు పథకాలు పేదలకు అందించారు. శ్రీకాళహస్తి నియోజక వర్గాన్ని ప్రగతి పథంలో నడుపుతున్నాము. రౌడీయిజాన్ని అదుపు చేసాము. ప్రజలకు ప్రశాంత పరిపాలన అందిస్తున్నామని వివరించారు. కూటమి ప్రభుత్వంలో చేపట్టిన ప్రగతిని ప్రతి ఒక్కరికి వివరించాలి.

**మున్సిపల్ ఎన్నికలు ఏక పక్షం కావాలి:**

గత ప్రభుత్వంలో మున్సిపల్ ఎన్నికల నిర్వహణ జరగలేదని దాని వల్ల మన మున్సిపాలిటి అభివృద్ధికి రావాల్సిన పలు పథకాల నిధులు రాలేదని అయితే ఈ ఏడాది మున్సిపల్ ఎన్నికల్లో శ్రీకాళహస్తి మున్సిపాలిటికి కూడా ఎన్నికలు జరుగుతాయని శాసనసభ్యుడు సుధీర్రెడ్డి స్పష్టం చేసారు. కాబట్టి ఈ ఎన్నికల్లో తెలుగుదేశం జెండాను మున్సిపాలిటి మీద ఆవిష్కరించాలన్నారు. మనం చేసిన ప్రగతి పనులు మనకు శ్రీరామరక్ష అన్నారు.అభ్యర్థులెవరైనా సరే అందరు కలిసికట్టుగా పని చేసి ఎన్నికలు ఏకపక్షం చేయాలని అన్ని వార్డులనుగెల్చుకొని రాష్ట్రంలోనే అత్యధిక స్థానాలు సాధించిన మున్సిపాలిటి కావాలని సుధీర్రెడ్డి సూచించారు. క్షేత్ర స్థాయిలో అనుసరిం చాల్సిన ప్రణాళికలను నాయకులతో చర్చించారు. ప్రతి వార్డులోనూ పార్టీ నాయకులు ప్రజలతో మమేకం కావాలన్నారు.మనది కూటమి కాబట్టి కూటమి పార్టీల నాయకులు కార్యకర్తలతో కలసి పని చేయాలన్నారు. చైర్మెన్, కౌన్సిలర్ టిక్కెట్ ఎవరికి వచ్చినా సరే విజయం మనది కావాలన్నారు. వ్యక్తిగత అభిప్రాయాలు, చిన్నపాటి విభేదాలు పక్కన పెట్టి, అందరూ ఐక్యంగా పని చేయాలన్నారు. క్షేత్ర స్థాయిలో పార్టీకి కార్యకర్తలే పట్టుకొమ్మలని మన ఐక్యతను చాటి మున్సిపాలిటిపై పసుపు .జెండా ఎగురవేయాలని పిలుపు నిచ్చారు. సమావేశంలో పేట బాలాజిరెడ్డి, మిన్నల రవి, సుబ్బయ్య, గుమ్మడి దశరధాచ్చారి,పార్టీ అధ్యక్షుడు జి.విజయకుమార్, కంఠా రమేష్, కాసరరం రమేష్, గోపినాధ్, వాకచర్ల గుర్రప్పశెట్టి తదితరులు పాల్గొన్నారు.

## కాణిపాకంలో నేడు(గురువారం)

పగలు : అభిషేకం -రాత్రి : మూషికవాహన సేవ

ఉభయదారులు : కాణిపాకం, కాకర్లవారిపల్లె, అగరంపల్లె, కాణిపాకం పట్నం, వడ్రాంపల్లె, కొత్తపల్లె, చినకాంపల్లె, తిరువణంపల్లె, గ్రామాదుల విశ్వకర్మ వంశస్థులు.

స్థానిక ఆస్థాన మండపంలో సాంస్కృతిక కార్యక్రమాలు: ఉదయం 10 గంటల నుండి 11 గంటల వరకు ఆస్థాన మండపంలో భక్తుల కాలక్షేపం నిమిత్తం ఉదయం 10 గంటల నుండి అర్ధరాత్రి 1 గంటల వరకు వివిధ ప్రాంతాలకు చెందిన ప్రముఖ కళాకారులచే భక్తిరంజని, హరికథలు, కూచిపూడి, భరతనాట్యం, పౌరాణిక నాటక ప్రదర్శనలు, కోలాటాలు, భజనలు వంటి సాంస్కృతిక కార్యక్రమాలు, 11గంటల నుండి అర్ధరాత్రి 1 గంటల వరకు దేవస్థానం వారిచే నిర్ణయింపబడిన వారిచే నాటకములు, గ్రామోత్సవం ప్రారంభమైనప్పటి నుండి కోలాటాలు, భజనలు

## గణనాధునికి ఘనంగా గ్రామోత్సవం



కాణిపాకం, సెప్టెంబర్ 19 ప్రభాతవార్త: కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామివారి దేవస్థానంలో జరుగుతున్న స్వామివారి వార్షిక బ్రహోత్మత్సవాల్లో భాగంగా బుధవారం జరిగిన నెమలివాహనసేవ సందర్భంగా ఉదయం సిద్దిబుద్ది సమేత గణనాధునికి ఘనంగా గ్రామోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా ఉదయం యాగశాలలో అర్చకులు యాగమూర్తికి శాస్త్రోక్తంగా ప్రత్యేకపూజలు నిర్వహించారు. అలాగే అలకరించిన సిద్ది బుద్ది సమేత గణనాధుని ఉత్సవమూర్తులను ప్రత్యేక పల్లకిపై వుంచి మంగళ వాయిద్యాల నడుమ గ్రామ పురవీధుల గుండా ఘనంగా ఊరేగించారు. ఈసందర్భంగా భక్తులు స్వామి, అమ్మవార్లకు మొక్కులు తీరు్చకున్నారు. ఈకార్యక్రమంలో ఆలయ చైర్మన్ వి.మణినాయుడు, ఈఓ కె.పెంచల కిషోర్, ఏఈఓ రవీంద్రబాబులతో పాటు ఆలయ ఆధికారులు, భక్తులు పాల్గొన్నారు.

## అలరించిన ఉషారాణి బృందం



తిరుమల,సెప్టెంబర్ 16 ప్రభాతవార్త : శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలలో భాగంగా తిరుమల తిరుపతి దేవస్థానం మరియు హిందూధర్మ ప్రచారిషత్ సంయుక్తంగా ఆధ్యాత్మిక ప్రవచనం మరియు సాంస్కృతిక కార్యక్రమాలను పలు చోట్లనిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా తిరుపతి సంగీత నృత్య కళాశాలలో కూచి విభాగానికి చెందిన డాక్టర్ ఉషారాణి బృందంచే స్థానిక అన్నమాచార్య కళామందిరంలో బుధవారం సాయంత్రం కూచిపూడి నృత్యప్రదర్శన కనులవిందుగా సాగింది. ఇందులో భాగంగా వారి శిష్యులైన కుమారి భానుజ, సాయిహర్షిని, జ్ఞాన ప్రసూన తదితరులు, వినాయక కౌతం, కనకధారా స్తోత్రం, అన్నమాచర్య కృతులైన వందే వాసుదేవం, రాజీవ్ నేత్రాయ లాంటి పలు కీర్తనలకు నృత్యప్రదర్శన గావించగా కార్యక్రమం ఆద్యంతం నయనానందకరంగా సాగింది.

## గంగమ్మను దర్శించుకున్న మాజీ మంత్రి రోజా



పుత్తూరు(నగరి), సెప్టెంబరు 16 ప్రభాతవార్త : నగరి పట్టణంలో అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్న శ్రీ గంగమ్మ తల్లి జాతర మహోత్సవంలో బుధవారం పర్యాటక శాఖ మాజీ మంత్రి ఆర్.కె.రోజా పాల్గొని అమ్మవారిని భక్తి,శ్రద్దలతో పూజించారు. జాతర సందర్భంగా గంగమ్మ తల్లి వేపాకు పందిరిని పండ్లతో సుందరంగా అలంకరించేందుకు, ఓరుగుంటాలమ్మ, దేశమ్మ అమ్మవార్లకు పట్టుసారెలు సమర్పించేందుకు మాజీ మంత్రి రూ. 55,000 వేలు విరాళం అందించారు. వివిధ రకాల పండ్లతో అలంకరించిన గంగమ్మ తల్లి భక్తులకు కనువిందు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అమ్మవార్ల ఆశీస్సులతో నగరి ప్రజలంతా సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మాజీ మంత్రితో పలువురు వైకాపా నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## వేడుకగా స్నపన తిరుమంజనం



తిరుమల,సెప్టెంబర్ 16ప్రభాతవార్తప్రతినిధి:శ్రీదేవి భూదేవి సమేత మలయప్పస్వామికి ఏలకలు, వట్టివేరు, ఎండు ద్రాక్ష, బాదం-పిస్తా తదితర సుగంధ ద్రవ్యాలతో రూపొందించిన విశేష మాలల మధ్య బుధవారం స్నపన తిరుమంజనం భక్తిశ్రద్ధలతో వైభవంగా జరిగింది. రంగనాయకుల మండపంలో మధ్యాహ్నం 1 నుండి 3 గంటల వరకు అర్చక స్వాములు వేద మంత్రోచ్చారణల నడుమ వైఖానస ఆగమోక్తంగా స్నపన తిరుమంజనం నిర్వహించారు. శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ మలయప్పస్వామివారి ఉత్సవమూర్తులను ప్రత్యేక వేదికపై ఆశీనులను చేసి, రంగురంగుల పుష్పాలతో సుందరంగా అలంకరించారు. అభిషేకానంతరం పెద్ద జీయ్యంగార్, చిన్న జీయ్యంగార్ వివిధ దివ్య పాశురాలను పఠించారు. ఈ వేడుకలో భాగంగా ఏలకలు, వట్టివేరు, ఎండు ద్రాక్ష, నీలిరంగు పవిత్ర మాలలు, బాదం-పిస్తా మాలలు, పసుపు కొమ్ముల మాలలు, నందివర్ధనం-తామర మాలలు, రోజ్ పెటల్స్ తో స్వామి, అమ్మవార్లను విశేషంగా అలంకరించారు. ఈ కార్యక్రమంలో టిటిడి ఈఓ ముద్దాడ రవిచంద్ర, బోర్డు సభ్యురాలు సుచిత్ర ఎల్లా, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## వినాయకునికి పూజలో పాల్గొన్న ఎమ్మెల్సీ



తిరుపతి హెల్త్, సెప్టెంబర్ 16 ప్రభాతవార్త : రెడ్డి అండ్ రెడ్డి కాలనీలో ఒకటవ స్ట్రీట్‌లో ఓల్డ్ మున్సిపల్ ఆఫీస్ ఎదురుగా రష్ హాస్పిటల్ ముందు ఆటో యూనియన్ సభ్యులు రష్ హాస్పిటల్ అధినేత, డాక్టర్ ఎమ్మెల్సీ సిపాయి సుబ్రహ్మణ్యం సహాయంతో వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుడి ప్రతిమకు డాక్టర్ ఎమ్మెల్సీ సిపాయి సుబ్రహ్మణ్యం పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. తర్వాత రష్ హాస్పిటల్ తరఫున నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం విచ్చేసిన భక్తులకు అన్నదానం చేసారు.

# సూళ్ళూరుపేట డివిజన్

## సర్వసభ్య సమావేశంలో ఎంపిపీ ఎంపిటీసీలకు సన్మానం



పెళ్లకూరు, సెప్టెంబర్ 16 ప్రభాతవార్త: గత ప్రభుత్వంలో ఎన్నికైన ఎంపిటీసీ, జడ్పిటిసిలకు ఈ నెలతో పదవీకాలం ముగియ నున్నదంతో బుధవారం జరిగిన చివరి సర్వసభ్య సమావేశంలో మండలంలో ఉన్న అందరూ ఎంపిటీసీ, జడ్పిటిసి, ఎంపిపీలకు ఘన సన్మానం చేసి వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ఎంపీపీ శేఖర్ రెడ్డి మాట్లాడుతూ తన అధికారంలో ఉండగా మాకు సహకరించిన అధికారులకు ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. అదే విధంగా మేము అధికారంలో ఉండగా మండలంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని కానీ శిథిలావస్థలో ఉన్న మండల రెవెన్యూ కార్యాలయం, మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయాల స్థానంలో కొత్త కార్యాలయాలను నిర్మించలేకపోయామని కొరత ఉందన్నారు. జడ్పిటిసి నన్నం ప్రిస్కిల్లా మాట్లాడుతూ ప్రజలు మాకిచ్చిన ఈ పదవీ కాలంలో అనేక సంక్షేమ కార్యక్రమాలను చేశామని అదేవిధంగా పదవి ఉన్న లేకున్నా ప్రజల పక్షాన నిలబడి పోరాడుతామన్నారు. మండల అభివృద్ధి అధికారి వేనయ్య ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మండలంలోని ఎంపిటీసీలు, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ప్రణాళిక బద్ధంగా ఎన్నికల నిర్వహణ చేపట్టాలి

**- రాష్ట్ర మున్సిపల్ సంచాలకులు సంపత్ కుమార్**



సూళ్లూరుపేట, సెప్టెంబర్ 16 ప్రభాతవార్త: మున్సిపాలిటీలో రాబోయే ఎన్నికలను ప్రణాళిక బద్ధంగా చేపట్టాలని రాష్ట్ర మున్సిపల్ శాఖ సంచాలకులు, కమిషనర్ సంపత్ కుమార్ సూచించారు. బుధవారం ఆయన స్థానిక మున్సిపల్ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా అధికారులతో మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణకు సంబంధించి పోలింగ్ కేంద్రాల ఏర్పాటు, ఇతర సన్నాహాలు గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. గమళ్ళ వీధిలోనిఅన్న క్యాంటీన్ తనిఖీ చేశారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన పబ్లిక్ పర్సెప్షన్ విధానంపై ప్రజలస్పందన ఎలా ఉందని ఆయన తెలుసుకున్నారు.అలాగే జాతీయ రహదారిపై గల డంపింగ్ యార్డును పరిశీలించారు. మంచినీటి వసతులు, పారిశుద్ధం, ఐవిఆర్ఎస్ కాల్స్ పై ప్రజల స్పందన అనే అంశాలపై ఆయన నివేదిక తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కే చిన్నయ్య, డిడి బాలసుబ్రమణ్యం, మేనేజర్ శ్రీనివాసులు ఆర్ఐఎంవి నారాయణ రెడ్డి, టీపీబివో బాలసుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

## పోలింగ్ కేంద్రాల ఏర్పాటుపై... రాజకీయ పార్టీలతో సమావేశం



సూళ్లూరుపేట, సెప్టెంబర్ 16 ప్రభాతవార్త: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు సూళ్లూరుపేట మండలంలో జరగబోవు ఎంపిటీసీ, జడ్పిటిసి ఎన్నికల నిర్వహణకు సంబంధించి పోలింగ్ స్టేషన్ల ఏర్పాటు పై అభ్యంతరాలు సూళ్లూరుపేట మండలంలోని రాజకీయ పార్టీల ప్రతినిధులతో బుధవారం ఎంపీడీవో కార్యాలయం నందు సమావేశం నిర్వహించారు. పోలింగ్ స్టేషన్లకు సంబంధించి వారి సూచనలు, అభ్యంతరాలు, అభిప్రాయాలను స్వీకరించారు. మండల పరిషత్ అభివృద్ధి అధికారివెంకటేశ్వరరావు మాట్లాడుతూ మన్నెముత్తేరి పంచాయతీలోని పోలింగ్ స్టేషన్ 22,23లలో గ్రామపంచాయతీలో ఉన్న పోలింగ్ కేంద్రాన్ని ప్రాథమిక పాఠశాలకు, పంచాయతీ ఆఫీసు ఉన్న పోలింగ్ స్టేషన్లో వేరే గ్రామానికి మార్చమని అభ్యంతరాలు వచ్చాయని ఎంపీడీవో తెలిపారు. మండలంలోని తీర ప్రాంత ప్రజలకు పోలింగ్ స్టేషన్‌కు వెళ్లేందుకు ప్రయాణ సౌకర్యం కల్పించాలని కోరినట్లు ఎంపీడీవో తెలిపారు. మొత్తం మండలంలో 32 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు ఆయన తెలిపారు. అలాగే రెండు పోలింగ్ కేంద్రాల మినహా మిగిలిన పోలింగ్ స్టేషన్‌లలో ఎటువంటి అభ్యంతరాలు రాలేదని తెలియజేశారు.

## శ్రీనగర్ కాలనీ...గణేష్ లడ్డు వేలంపాట ఒక లక్ష 62 వేలు



సూళ్లూరుపేట, సెప్టెంబర్ 16 ప్రభాతవార్త: సూళ్లూరుపేటలోని శ్రీనగర్ కాలనీలో నిర్వహిస్తున్న వినాయక చవితి ఉత్సవాల భాగంగా బుధవారం రాత్రి శ్రీ గణేష్‌ని లడ్డు వేలం పాటలు రికార్డు స్థాయిలో ఒక లక్ష 62 వేల రూపాయలకు కాలనీ వాసి పర్వత రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, కవిత దంపతులు వేలం పాటలో దక్కించుకున్నారు. పోటాపోటీగా జరిగిన ఈ వేలం పాటలో చివరకు ప్రభాకర్ రెడ్డి లడ్డు పాటలో విజితగా నిలిచారు. గత రెండు పర్యాయములు ఈ గణేష్ లడ్డును పర్వతరెడ్డి ప్రభాకర్ రెడ్డి దక్కించుకొని ఉన్నారు.

## మన్నెం రామిరెడ్డిచే...అన్నదానం



తిరుపతి విద్య, సెప్టెంబర్ 16 ప్రభాతవార్త: పండుగ వేళ సేవా కార్యక్రమానికి శ్రీనివాసపురం వేదికైంది. వినాయక చవితిని పురస్కరించుకుని మన్నెం రామిరెడ్డి కుటుంబం ఆధ్వర్యంలో స్థానికులకు అన్నప్రసాద వితరణ నిర్వహించారు. గత 16 ఏళ్లుగా ప్రతి ఏటా వినాయక చవితి సందర్భంగా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తూ సేవా సంప్రదాయాన్ని కొనసాగిస్తున్నారు. ఈ ఏడాది కూడా నిర్వహించిన అన్నదాన కార్యక్రమానికి శ్రీనివాసపురం, పరిసర ప్రాంతాల నుంచి వందలాది మంది తరలివచ్చి అన్నప్రసాదాలను స్వీకరించారు.తిరుపతి పరిధిలోని శ్రీనివాసపురం లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. రాయలసీమ విద్యాసంస్థల అధినేత, శ్రీరామ ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ మన్నెం రామిరెడ్డి ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ చేపట్టారు. ఈ సందర్భంగా స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొనడంతో ప్రాంగణం సందడిగా మారింది.వినాయక చవితి సందర్భంగా రాయలసీమ విద్యాసంస్థల ప్రాంగణంలో వినాయక విగ్రహాన్ని ప్రతిష్ఠించి మూడు రోజులపాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించిన అనంతరం వినాయక విగ్రహాన్ని నిమజ్జనం చేస్తారు. పూజా కార్యక్రమాలతో పాటు అన్నదానం నిర్వహించడంతో భక్తులు, స్థానికులు పాల్గొన్నారు.మన్నెం రామిరెడ్డి మాట్లాడుతూ తమ కుటుంబం ఆధ్వర్యంలో గత 16 సంవత్సరాలుగా వినాయక చవితి సందర్భంగా శ్రీనివాసపురం ప్రజలకు అన్నదానం నిర్వహిస్తు న్నామని తెలిపారు. ఈ సేవా కార్యక్రమాన్ని రాబోయే సంవత్సరాల్లోనూ నిరంతరాయంగా కొనసాగిస్తామని చెప్పారు. పండుగలను అందరూ ఆనందంగా, ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని, ప్రజలంతా ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో జీవించాలని తెలిపారు.అన్నప్రసాద వితరణలో వందలాది మంది స్థానికులు పాల్గొని భోజనం స్వీకరించారు. కార్యక్రమంలో శ్రీరామ ఇంజనీరింగ్ కళాశాల సెక్రటరీ మన్నెం రామసుబ్బారెడ్డి, డైరెక్టర్ మన్నెం అరవింద్ కుమార్ రెడ్డి, స్థానికులు, కళాశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# తిరుపతి డివిజన్

## ఆలయ సిబ్బందికి తెలుగుగంగ క్వార్టర్స్ కేటాయించండి

– ప్రిన్సిపల్ సెక్రటరీకి వినతి



శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 16 ప్రభాతవార్త

శ్రీకాళహస్తీశ్వరాలయంలో పని చేస్తున్న సిబ్బందికి గృహవసతి కల్పించాలని ఆలయ ఛైర్మన్ కొట్టే సాయిప్రసాద్ దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి కన్నబాబును కోరారు. ప్రిన్సిపల్ కార్యదర్శి బుధవారం శ్రీకాళహస్తీశ్వరాలయంలో పలు అంశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆలయంలో అమలు జరుగుతున్న ఆన్‌లైన్ విధానాన్ని సంబంధించి ఆలయంలో భక్తులతో అడిగి తెలుసుకున్నారు. కొత్త విధానంపై భక్తుల అభిప్రాయాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఛైర్మన్ అనుబంధ ఆలయాలకు సంబంధించి అభివృద్ధిని వివరించారు. ప్రస్తుతం అమలుజరుగుతునన్న పనులలను వివరించారు. శివం టు శివం పనులను వివరించారు. ఈ సందర్భంగా కన్నబాబు అధికారులతో సమావేశం నిర్వహించారు. భక్తుల సేవే పరమావధిగా పని చేయాలని సూచించారు. ఆలయ సిబ్బంది భక్తులను భగవంతుని భావించి సేవలు అందించాలని సూచించారు. సమావేశంలో ఛైర్మన్ ,ఇఓ వెంకటేశులు, ఇఇ శ్రీనివాసరాజు, ఏఇఓలు మోహన్, హేమమాలిని, లోకేష్‌బాబు, విద్యాసాగర్‌రెడ్డి, ఆలయ పర్యవేక్షకులు నాగభూషణం యాదవ్, రవి, నాగయ్య, శ్రీహరి, ఇంజనీరింగ్ విభాగం సిబ్బంది పాల్గొన్నారు.

## శివయ్య సేవలో విమానయాన శాఖాధికారి

శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 16 ప్రభాతవార్త



శ్రీకాళహస్తీశ్వరాలయంలో బుధవారం కేంద్ర పౌరవిమానశాఖాధికారి డిప్యూటీ డైరెక్టర్ జనరల్ ప్రమోద్‌ఠాకూర్ దరిస్నంచుకున్నారు. ఆయనకు డిప్యూటీ డైరెక్టర్ జనరల్ ఐదుగురు ఎగ్జిక్యూటివ్ జనరల్‌తో రాగా దక్షిణ గోపురం వద్ద వారికి ఏఇఓ లోకేష్‌బాబు, ఏపిఆర్‌ఓ రవి, లైజన్‌అధికారి ఏఇఎస్‌ఎస్‌ఎన్ మూర్తి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. స్వామిఅమ్మవార్ల అంతరాలయ దర్శనం ఏర్పాటు చేశారు. మృత్యుంజయస్వామి ఆలయం వద్ద వేదపండితులచే ప్రత్యేక ఆశీర్వచనాలు అందించారు. ఏఇఓ లోకేష్‌రెడ్డి స్వామిఅమ్మవార్ల చిత్రపటాలను అందించారు.

## మిమిక్రీతో ఆకట్టుకున్న బాలసుబ్రమణ్యం



తొట్టంబేడు సెప్టెంబర్ 16 ప్రభాతవార్త: వినాయక చవితి సంబరాల్లో భాగంగా ముచ్చివోలు గ్రామంలో నిర్వహించిన వేడుకల్లో మిమిక్రీ కళాకారుడు, ఉపాధ్యాయుడు కయ్యూరు బాలసుబ్రమణ్యం చేసిన మిమిక్రీ ప్రదర్శన అందరినీ మంత్రముగ్ధులను చేసింది. దిగువ సాంబయ్యపాళెం ఫౌండేషన్ స్కూల్లో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న బాలసుబ్రమణ్యం వివిధ వాహనాల శబ్దాలు, పక్షులు, జంతువుల అరుపులు, సినీ నటులు, రాజకీయ నాయకుల గొంతులను అద్భుతంగా అనుకరిస్తూ ప్రదర్శన ఇచ్చారు. ఆయన గొంతు మార్చిన ప్రతిసారీ ప్రేక్షకుల నుంచి చప్పట్లు మారుమోగాయి. చిన్నారుల నుంచి పెద్దల వరకు ఆయన ప్రతిభకు ఫిదా అయ్యారు. అనంతరం గ్రామ పెద్దలు, ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామస్థులు బాలసుబ్రమణ్యంను ఘనంగా సన్మానించి అభినందించారు. ఉపాధ్యాయ వృత్తిలో ఉంటూనే కళను కాపాడుతున్న ఆయనను పలువురు ప్రశంసించారు.

## పౌష్టికాహారంతోనే...ఆరోగ్యకరమైన భవిష్యత్తు




తొట్టంబేడు, సెప్టెంబర్ 16 ప్రభాతవార్త: పిల్లల ఆరోగ్యమే దేశ భవిష్యత్తు అనే నినాదంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న పోషణ్ మాహ్ కార్యక్రమం తొట్టంబేడు మండలం గురుకులపాలెంలో ఘనంగా జరిగింది. శ్రీకాళహస్తి ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని తొట్టంబేడు3 సెక్టార్, గురుకులపాలెం వైసీ అంగన్ వాడీ కేంద్రంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. విజయవాహిని చారిటబుల్ ఫౌండేషన్ తరపున ప్రోగ్రామ్ అసోసియేట్ వి.లక్ష్మి ఈ కార్యక్రమానికి హాజరై తల్లులకు, చిన్నారులకు పోషకాహార ప్రాముఖ్యతపై విస్తృతంగా అవగాహన కల్పించారు. కేవలం కడుపు నింపడం కాదు, శరీరానికి కావాల్సిన పోషకాలు అందించడమే అసలైన ఆహారమని ఆమె వివరించారు. ఇంట్లో దొరికే తక్కువ ఖర్చుతో కూడిన ఆకుకూరలు, చిరుధాన్యాలతోనే సంపూర్ణ పోషణ పొందవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్ వాడీ టీచర్లు, ఆయాలు, గ్రామానికి చెందిన గర్భిణీలు, బాలింతలు, తల్లులు, చిన్నారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పోలింగ్ కేంద్రాలపై రాజకీయ పార్టీల సమావేశం



తొట్టంబేడు, సెప్టెంబర్ 16 ప్రభాతవార్త: జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికలకు రంగం సిద్ధమవుతోంది. ఎంపీటీసీ, జడ్పీటీసీ 2వ సాధారణ ఎన్నికలకు సంబంధించి తొట్టంబేడు మండలంలో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. ఇందులో భాగంగా బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో పి.సురేంద్రనాథ్ ఆధ్వర్యంలో అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఎన్నికలకు పోలింగ్ కేంద్రాల ముసాయిదా జాబితానే ఈ సమావేశంలో ప్రధాన అజెండా చర్చించారు గత ఎన్నికల్లో ఎదురైన ఇబ్బందులు పునరావృతం కాకుండా, ఓటర్లకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అధికారులు చర్యలు తీసుకున్నామని సమావేశంలో ఎంపిడిఓ సురేంద్రనాద్ తెలిపారు. ఈ నేపథ్యంలోనే అన్ని పార్టీల అభిప్రాయాలను తీసుకోవడం కోసం ఈ అఖిలపక్ష భేటీ ఏర్పాటు చేశామన్నారు. సమావేశం ప్రారంభం నుంచే పార్టీల నేతలు తమ వాదనలను వినిపించారు. కొన్ని పోలింగ్ కేంద్రాలు ఓటర్లకు దూరంగా ఉన్నాయని, మరికొన్ని చోట్ల మంచినీరు, నీడ, మరుగుదొడ్లు వంటి కనీస వసతులు లేవని నేతలు అధికారుల దృష్టికి తెచ్చారు. కొన్ని గ్రామాల్లో పోలింగ్ కేంద్రాల స్థానాలను మార్చాలని డిమాండ్ చేశారు. ప్రతి ఓటరు సులభంగా వచ్చి ఓటు వేసేలా కేంద్రాలను ఏర్పాటు చేయాలని కోరారు. దీనిపై స్పందించిన ఎంపీడీవో సురేంద్రనాథ్ అన్ని పార్టీల సూచనలను సానుకూలంగా పరిశీలిస్తామని, ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం పోలింగ్ కేంద్రాలను ఖరారు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కీలక సమావేశంలో తొట్టంబేడు మండల టీడీపీ అధ్యక్షులు రావిళ్ల మునిరాజు నాయుడు, వైసీపీ సీనియర్ నాయకులు పున్నం వాసుదేవ నాయుడు, వైసీపీ మండల అధ్యక్షులు కొగిల సుబ్రహ్మణ్యం, బీజేపీ మండల అధ్యక్షులు వేదం కృష్ణయ్య, నాయకులు సుబ్రహ్మణ్యం రెడ్డి, అమర్నాథ్, సీపీఎం నాయకులు గురవయ్య, ఉన్నం ప్రసాద్, మాజీ జెడ్పీటీసీ వెంకటాచలం, కొన్నలి రమేష్, జనసేన నాయకులు పేట చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు. వారి హాజరుతో సమావేశం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది.

## చందు కుటుంబాన్ని ఆదుకుంటాం!



తొట్టంబేడు, సెప్టెంబర్ 16 ప్రభాతవార్త: గుండెలు గుంట కు చెందిన సీనియర్ తెలుగు దేశం నాయకుడు ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ మృతి చెం దారు. ఆ కుటుంబానికి అండగా ఉంటామని శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డి దంపతులు పరామర్శించారు. ఒక పార్టీ కార్యకర్త మరణం కేవలం ఒక కుటుంబానికే కాదు, పార్టీకే తీరని లోటు. తొట్టంబేడు మండలం గుండెలగుంట గ్రామంలో అదే జరిగింది. తెలుగుదేశం పార్టీ వీరాభిమాని, యువకుడు చంద్రశేఖర్ అలియాస్ చందు ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోవడంతో విషాదం చోటు చేసుకుంది. ఈ విషయం తెలుసుకున్న తెలుగుదేశం పార్టీ యువనేత, శ్రీకాళహస్తి నియోజకవర్గంలో తనదైన ముద్ర వేస్తున్న బొజ్జల సుధీర్ రెడ్డి ఆయన సతీమణి బొజ్జల రిషితా రెడ్డితో కలిసి చందు చిత్రపటానికి పూలమాలలు వేసి కన్నీటి నివాళులర్పిం చారు. ఆయనతోపాటు తొట్టంబేడు మండల అధ్యక్షులు రావిళ్ళ ముని రాజనాయుడు, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రంగేనేని చెంచయ్యనాయుడు, కొన్నలి. రమేష్, ఆయన వ్యక్తిగత పిఏ చిట్టత్తూరు బాలాజీ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సన్నిధివీధి వినాయకుని వద్ద అన్నదానం



శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 16 ప్రభాతవార్త:

పండగలు,ఉత్సవాలు మన సంప్రదాయాలు సంస్కృతిని భావి తరాలకు అందించే ఆయుధాలని శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలి మాజీ ఛైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు అన్నారు. బుధవారం సన్నిధివీధి వినాయకుని ఆలయం వద్ద సన్నిధివీధి యువత భారీ ఎత్తను అన్నదానం ఏర్పాటు చేసారు.ఈ కార్యక్రమాలకు మాజీ ధర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు ముఖ్యఅతిధిగా వచ్చారు. ఈ నేపథ్యంలో ఏర్పాటు చేసిన సామాజిక కార్యక్రమాలకు వచ్చిన ఆయన పూజలు నిర్వహించారు. అన్నదానంను మాజీ చైర్మెన్ శ్రీనివాసులు ప్రారంభించారు.ఈ కార్యక్రమాల్లో రవి, మైనంపాటి మస్తాన్,తీగల చిన్నా,ధన, మచ్చా శ్యాం కుమార్,మచ్చాభాస్కర్ ఆశాకిరణ్, అనుదీప్, జగ్గా, సుబ్బు, సుధాకర్, శీను, ప్రసాద్,జితేంద్ర, యోగి పర్యవేక్షించారు.

## నేడు రక్తదాన శిబిరం



శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 16 ప్రభాతవార్త: భారత ప్రధాని నరేంద్రమోదీ జన్మదిన సందర్భంగా గురువారంపట్టణ నడిబొడ్డులోని సరస్వతి ఆడిటోరియంలో మెగా రక్తగాన శిబిరం నిర్వహించుటకు సన్నాహాలు జరుగుతున్నాయని రాష్ట్ర బిజెపి ఉపాధ్యక్షుడు కోలా ఆనంద్‌కుమార్ బుధవారం వివరించారు.ప్రధాని 76వ సన్మదిన సందర్భంగా కూటమి నాయకులు,యువకులు తమ సహాకారాన్ని అందించాలన్నారు. ఉదయం 8గంటల నుంచి రక్తదాన శిబిరం ప్రారంభం అవుతుందని ఆయన వివరించారు.పాతికేళ్ళుగా నరేంద్రమోదీ జీ రాజకీయంగా భారత దేశ అభివృద్ధి కోసం పాటు పడుతున్నారని వివరించారు.2047 వికసిత్‌భారత్‌లో ప్రపంచంలోనే భారతదేశం అగ్రగామిగా నిలుపుటకు ఆయన కృషికి మనమందరం సహాకరించాలని పిలుపు నిచ్చారు.

## ఆరోగ్య మంత్రి జన్మదిన వేడుకలు



శ్రీకాళహస్తి,సెప్టెంబర్ 16 ప్రభాతవార్త:

శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలో బుధవారం రాష్ట్ర వైద్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ జన్మదిన వేడుకలను బిజెపి నాయకులు,కార్యకర్తలు ఘనంగా జరుపుకున్నారు.బుధవారం రాష్ట్ర బిజెపి ఉపాధ్యక్షుడు కోలా ఆనంద్‌కుమార్ సారధ్యంలో సామాజిక కార్యక్రమాలను నిర్వహించారు.ఈ సందర్భంగా ఉదయం వాయులింగేశ్వరుడు స్వయంభువుగా వెలసిన దివ్యక్షేత్రంలో మంత్రి పేర పూజలు,అభిషేకాలు జరిపించారు. తరువాత రామసేతు వంతెన సర్కిల్ వద్ద భవన నిర్మాణ కార్మికులతో కలసి సంబరాలు జరుపుకున్నారు.కార్మీకులకు అల్పాహారం అందించారు.ఈ కార్యక్రమాల్లో కోలా ఆనంద్‌కుమార్‌తో పాటు కార్యవర్గ సభ్యురాలు కండ్రిగ ఉమ,జిల్లా ఉపాధ్యక్షుడు మేళాగారం సుబ్రమణ్యం రెడ్డి పట్టణ కార్యదర్శి కటికం చంద్రశేఖర్,ఉపాధ్యక్షుడు పుణ్యం డిల్లి కుమార్,ప్రధాన కార్యదర్శి కోనేటి అయ్యప్ప, ఓబిసి మోర్చాకు చెందిన కృష్ణారెడ్డి, సజ్జ హరిష్, రమేష్‌నాయుడు, శ్యామ్, శ్రీధర్,బిందుకుమార్,నాని, వెంకట్రాయులు పాల్గొన్నారు.

## మున్సిపల్ వేలం పాటలు వాయిదా!

శ్రీకాళహస్తి,సెప్టెంబర్ 16 ప్రభాతవార్త: శ్రీకాళహస్తి మున్సిపల్ కార్యాలయంలో బుధవారం నిర్వహించాల్సిన తేరువీధిలోని మున్సిపల్( తేరుపక్కన) కాంప్లేక్సు వేలం పాటలను రద్దు చేసారు. ఇక్కడ మున్సిపల్ కాంప్టేక్సులో యాత్రికుల వసతి గృహం ఉండేది.గతంలో అప్పటి అధికార పార్టీ(వైకాపా) మద్దతు దారుడు నిర్వహించే వారు. అయితే కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత ఈ లీజు వివాదాస్పదవమైంది. మున్సిపల్ అధికారుల తప్పిదంతో సుమారు మూడు సంవత్సరాలు కోర్టులలో సాగింది. అయితే ఈ స్థలాన్ని పిపిపి విధానంలో అప్పగించాలని ప్రతిపాదించారు. అయితే మున్సిపల్ అధికారులు ఈ కాంప్టేక్సును వేలం పాటలు నిర్వహించుటకు నిర్ణయించారు. బుధవారం జరగాల్సిన వేలం పాటలు వాయిదా పడ్డాయి. ఈ అంశానికి సంబంధించి కమిషనర్ కెవి కృష్ణారెడ్డిని వివరణ కోరగా ఒకే టెండర్ రావటంతో వాయిదా వేసామని తెలిపారు.

## ఎల్ఐసి కాలనీలో లక్ష్మీగణపతి పూజలు



తొట్టంబేడు,సెప్టెంబర్ 16 ప్రభాతవార్త: మండలంలోని ఎల్ఐసి కాలనీలో బుధవారం లక్ష్మీగణపతి విగ్రహం వద్ద యువకులు ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో బొజ్జల రిషితా రెడ్డి ముఖ్యఅతిధిగా హాజరై పూజలు జరిపారు. వినాయకునికి సారె అందించి పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా యువకులు ఆమెకు వివరిస్తూ వినాయక చవితి ఉత్సవాలను నవరాత్రి సంబరాలుగా నిర్వహించటం ఆనవాయితి అన్నారు.3వ రోజు ఉత్సవాల సందర్భంగా పేదలకు అన్నదాన కార్యక్రమాలను ఏర్పాటు చేసారు. రిషితారెడ్డికి ఆలయ కమిటి ఉత్సవాల నిర్వహణ కమిటి ఘనస్వాగతం పలికారు.లక్ష్మీగణపతికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా కమిటి ఏర్పాటు చేసిన అన్నదానం కార్యక్రమాలకు ఆమె ముఖ్యఅతిధిగా పేదలకు వడ్డించారు.యువకుల్లో సామాజిక సేవను ఆమె కొనియాడారు.ఈ కార్యక్రమాల్లో కమిటికి చెందదిన మదన్‌మోహన్, భాస్కరయ్య, శేషాచలంరెడ్డి, సూర్యప్రకాష్‌లతో పాటు పలువురు కమిటి సభ్యులు కాలనీ వాసులు, తెలుగుదేశం మద్దతు దారులు హాజరయ్యారు.

## ఓసూరమ్మకు నూతన విగ్రహం



ఏర్పేడు,సెప్టెంబర్ 16 ప్రభాతవార్త

మండలంలోని మోదుగుల పాళెం లో నూతనంగా నిర్మించిన ఓసూరమ్మ ఆలయంలో నూతన విగ్రహాన్ని సిద్ధంద చేసారు. గ్రామంలో గ్రామదేవత విగ్రహాన్ని స్థానిక ఆచార సంప్రదాయాల మేరకు ప్రతిష్టించుటకు నూతన విగ్రహాన్ని తయారు చేయించారు. స్థానిక ఆచారం మేరకు పూజలు నిర్వహించారు.ఈ విగ్రహాన్ని చిందేపల్లిలోసిద్దేశ్వరస్వామి ఆలయాన్ని నిర్మించిన గంగలపూడి గిరిధర్ రెడ్డి ఓసూరమ్మ విగ్రహాన్ని సుమారు రూ.70వేలతో తయారు చేయించారు. దాన్ని అందించారు.ఈ సందర్భంగా ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు గిరిధర్‌రెడ్డిని సత్కరించారు. ఆయన విగ్రహాన్ని ఆలయ నిర్వాహాకులకు అందించారు. ఆలయ నిర్మాణం చివరి దశలో ఉందని వివరించారు.

## పీజీ ఫలితాలు ఎప్పుడొస్తాయ్?

–ఫలితాల విడుదలలో జాప్యంపై వీసీకి వినతి



తిరుపతి విద్య, సెప్టెంబర్ 16 ప్రభాతవార్త

పరీక్షలు పూర్తయి నెలలు గడుస్తున్నా ఫలితాలు విడుదల కాకపోవడంతో ఎస్వీయూ పరిధిలోని పీజీ విద్యార్థుల ఎదురుచూపులు కొనసాగుతున్నాయి. 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించిన పీజీ 1, 3, 4వ సెమిస్టర్ ఫలితాలను వెంటనే విడుదల చేయాలని కోరుతూ ఎస్‌ఎఫ్ఐ నాయకులు బుధవారం వర్సిటీ ఉపకులపతి ప్రొఫెసర్ టాటా నరసింగరావును కలిసి వినతిపత్రం అందజేశారు.పరీక్షలు నిర్వహించి దాదాపు ఏడు నెలలు గడుస్తున్నా ఫలితాలు రాకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఎస్‌ఎఫ్ఐ నాయకులు తెలిపారు. ఇప్పటికే పీజీ కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులు ఫలితాలు, ధ్రువపత్రాల కోసం ఎదురుచూడాల్సి వస్తోందన్నారు. దీంతో ఉద్యోగ నియామకాలు, ఉన్నత విద్య ప్రవేశాలు, ఇతర అవకాశాలకు దరఖాస్తు చేసుకోవడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. ఫలితాల విడుదలపై సంబంధిత అధికారులను పలుమార్లు సంప్రదించినప్పటికీ స్పష్టమైన సమాచారం అందడం లేదని వారు తెలిపారు. ఫలితాల ప్రక్రియను టీసీఎస్ సంస్థకు అప్పగించినప్పటికీ విద్యార్థులకు ఎప్పుడు ఫలితాలు వస్తాయనే విషయంపై స్పష్టత లేకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు.విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఫలితాల ప్రక్రియను వేగవంతం చేసి పీజీ 1, 3, 4వ సెమిస్టర్ ఫలితాలను తక్షణమే విడుదల చేయాలని ఎస్‌ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. సమస్య పరిష్కారం కాకపోతే విద్యార్థులతో కలిసి ఛలో యూనివర్సిటీ కార్యక్రమం చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఎస్‌ఎఫ్ఐ జిల్లా అధ్యక్షురాలు పవిత్ర, జిల్లా ఉపాధ్యక్షుడు అశోక్ కుమార్, యూనివర్సిటీ కార్యదర్శి నరసన్న, జిల్లా కమిటీ సభ్యులు సునీత, ప్రవీణ్, మహేష్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

## మాస్టర్ అథ్లెటిక్స్‌లో తిరుపతి జిల్లా క్రీడాకారుల సత్తా



తిరుపతి విద్య, సెప్టెంబర్ 16 ప్రభాతవార్త:

మాస్టర్ అథ్లెటిక్స్ పోటీల్లో తిరుపతి జిల్లాకు చెందిన క్రీడాకారులు ప్రతిభ చాటారు. ఆంధ్రప్రదేశ్ మాస్టర్ అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పశ్చిమగోదావరి జిల్లా తణుకులో సెప్టెంబర్ 12, 13 తేదీల్లో నిర్వహించిన 44వ ఆంధ్రప్రదేశ్ అంతర్ జిల్లాల మాస్టర్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్-2026లో పలు పతకాలు సాధించారు.తిరుపతి జిల్లాకు చెందిన డా. పాకనాటి హరికృష్ణ 50 సంవత్సరాల విభాగంలో హ్యామర్ త్రోలో కాంస్య పతకం సాధించారు. తాతిరెడ్డి రామకృష్ణారెడ్డి 35 సంవత్సరాల విభాగంలో హ్యామర్ త్రోలో స్వర్ణ పతకం సాధించారు. సి.రమణన్ 55 సంవత్సరాల విభాగంలో నడక పోటీలో స్వర్ణం కైవసం చేసుకున్నారు.అదేవిధంగా డా. ఆనందరావు 60 సంవత్సరాల విభాగంలో షాట్‌పుట్‌లో స్వర్ణ పతకం సాధించడంతో పాటు హైజంప్, 200 మీటర్ల పరుగు పందెంలో రజత పతకాలు సాధించారు. ఈ పోటీల్లో తిరుపతి జిల్లా క్రీడాకారులు ప్రతిభ కనబరిచి జిల్లాకు పలు పతకాలు తీసుకురావడం పట్ల క్రీడాభిమానులు హర్షం వ్యక్తం చేశారు. పతకాలు సాధించిన క్రీడాకారులను తిరుపతి జిల్లా మాస్టర్ అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డా. పాకనాటి హరికృష్ణ, కార్యదర్శి ఇంజనీర్ రామచంద్రయ్య, ఓం ప్రకాష్‌రెడ్డితో పాటు పలువురు క్రీడాభిమానులు అభినందించారు.

## వినాయకుని కరుణాకటాక్షాలు అందరిపై ఉండాలి : రిషితా రెడ్డి

రేణిగుంట, సెప్టెంబరు 16 ప్రభాతవార్త:



ముక్కోటి దేవతలకు తొలివేలుపుగా పూజలందుకునే శ్రీ వినాయక స్వామికరుణాకటాక్షాలు ప్రజలందరిపై ఎల్లవేళలా ఉండాలని బొజ్జల రిషితా రెడ్డి ఆకాంక్షించారు. రేణిగుంట మండలం గురవరాజుపల్లిలో వైభవంగా జరుగుతున్న వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం ఆమె శ్రీ బొజ్జ గణపయ్యను దర్శించుకున్నారు. ప్రత్యేకంగా అలంకరించిన వినాయక మండపంలో వక్రతుండునికి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. విఘ్నాలను తొలగించే విఘ్నేశ్వరుని అనుగ్రహంతో నియోజకవర్గ ప్రజలు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో సుభిక్షంగా ఉండాలని ప్రార్థించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ తేనెపల్లి నారాయణ, వైద్యులు డాక్టర్ జనార్దన్, టీడీపీ యూనిట్ ఇన్‌చార్జి నారాయణ, స్థానిక నాయకులు నిరంజన్, ముని, భాస్కర్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## కరకంబాడిలో ఉచిత కంటి వైద్య శిబిరం

రేణిగుంట, సెప్టెంబరు 16 ప్రభాతవార్త:

రేణిగుంట మండలం కరకంబాడి గ్రామంలో రాస్ మహిళా జ్యోతి మ్యూచువల్ బెనిఫిట్ ట్రస్ట్ ఆధ్వర్యంలో హరే కృష్ణ నేత్రాలయ సహకారంతో బుధవారం ఉచిత మెగా కంటి వైద్య శిబిరాన్ని



నిర్వహించారు. రాస్ సంస్థ డైరెక్టర్ వి. నాగరాజు ఆదేశాల మేరకు నిర్వహించిన శిబిరానికి టిడిపి కరకంబాడి క్లస్టర్ ఇంచార్జ్ బుజ్జి నాయుడు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కంటి సమస్యలు, కళ్ల నుంచి నీరు కారడం, కంటి శుక్లం, రాత్రి వేళల్లో చూపు మందగించడం తదితర సమస్యలకు వైద్యులు పరీక్షలు నిర్వహించారు. మొత్తం 123 మంది కంటి పరీక్షలు చేయించుకోగా, వారిలో 32 మందిని శస్త్రచికిత్సలకు ఎంపిక చేశారు.ఎంపికైన వారిని బుధవారం సాయంత్రం నేత్రాలయానికి తరలించి, గురువారం ఉదయం శస్త్రచికిత్సలు నిర్వహించి తిరిగి తీసుకువస్తామని హరే కృష్ణ నేత్రాలయ నిర్వాహకుడు వెంకటేష్ తెలిపారు. ముఖ్యఅతిథి బుజ్జి నాయుడు మాట్లాడుతూ గ్రామంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించడం సంతోషకరమన్నారు. మహిళలను పొదుపు సంఘాలుగా ఏర్పాటు చేసి, వారు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు అవసరమైన సహకారం అందిం చడంతో పాటు రాస్ సంస్థ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని తెలిపారు. ఉచిత వైద్య శిబిరాలతో పాటు ఉపాధి శిక్షణ కార్యక్రమాలు నిర్వహించి మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో రాస్ ట్రస్ట్ సభ్యులు సుబ్బరత్నమ్మ, మస్తానమ్మ, నిత్యసుధ, ప్రాజెక్టు అధికారి రవి, బీబీవీ నిర్వాహకుడు రమేష్ రెడ్డి, క్షేత్రస్థాయి అధికారి రామానుజులు, అన్బలగన్, స్వాతి, ఇందుమతి, శంకరయ్యతో పాటు హరే కృష్ణ నేత్రాలయ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

17 CTR 6:17 CTR 6.qxd 9/17/2026 12:12 AM Page 1



## ఉన్నత పాఠశాలలో ఘనంగా ఓజోన్ డే కార్యక్రమం.

చిట్వేలి,సెప్టెంబర్ 16 ప్రభాతవార్త:



ప్రపంచ ఓజోన్ డే సందర్భంగా స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు బుధవారం ప్రపంచ ఓజోన్ డే కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఓజోన్ ప్రాముఖ్యతను తెలుపుతూ ర్యాలీ మరియు ప్ల కార్డ్ ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు సోఫియా మాట్లాడుతూ విద్యార్థులకు ఓజోన్ పొర సంరక్షణకు తీసుకోవలసిన చర్యల గురించి వివరించారు. ఏపీఎన్జీసి క్లస్టర్ కో ఆర్డినేటర్ శివ నారాయణ గౌడ్ మాట్లాడుతూ అతినీల లోహిత కిరణాల నుండి మానవాళిని రక్షిస్తున్న ఓజోన్ ని విచ్ఛిన్నం చేసే క్లోరో క్లోరో కార్బన్లను విడుదల చేయు రెఫ్రిజిరేటర్లు,ఎయిర్ కూలర్లు వంటి గృహోపకరణాల మీద ఆధారపడటం తగ్గించాలని విస్తృతంగా మొక్కలు నాటి గ్రీన్ హౌస్ వాయువుల ద్వారా జరిగే గ్లోబల్ వార్మింగ్ ఉపద్రవాలని నిర్మూలించాలని వివరించారు. కార్యక్రమంలో సీనియర్ ఉపాధ్యాయులు విశ్వనాథం, సుభాష్ చంద్రబోస్, నవీన్, గీతా రాణి, లిల్లీ పుష్ప రాణి, లక్ష్మి కళావతి, చెన్నయ్య, వెంకటేష్, ప్రవీణ్ కుమార్, అనూష, చంటి పెంచల్ దాస్, ఈశ్వర్ రాజు, రమాదేవి, నాగలక్ష్మి, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు కళాశాల మరియు పాఠశాల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

## ముసాయిదా పోలింగ్ స్టేషన్లపై సమీక్ష.



చిట్వేలి, సెప్టెంబర్ 16 ప్రభాత వార్త: రాష్ట్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ వారి ఆదేశాల మేరకు బుధవారం స్థానిక మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారి శ్రీనివాసులు అధ్యక్షతన కార్యాలయ పరిధిలోని సభాభవనంలో ముసాయిదా పోలింగ్ స్టేషన్లపై సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో జడ్పీటీసీ, ఎంపీటీసీ ముసాయిదా పోలింగ్ స్టేషన్లపై అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు, ప్రజాప్రతినిధులతో చర్చించారు. ముసాయిదా పోలింగ్ స్టేషన్లకు సంబంధించి వారి అభిప్రాయాలు, అభ్యంతరాలను స్వీకరించారు. ఎన్నికల ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించేందుకు సూచనలు, అభ్యంతరాలను పరిశీలించ నున్నట్లు ఎంపీడీవో శ్రీనివాసులు తెలిపారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు ఎల్వి మోహన్ రెడ్డి, కూటమి నాయకులు బాలు రామాంజనేయులు నాయుడు, కాకర్ల నాగార్జున, గుత్తి నరసింహ, బుంగటావుల రాజశేఖర్, తొంబరపు సుబ్బరాయుడు,బాపూజీ, బొంతల నాగేశ్వర మరియు అన్ని రాజకీయ వామపక్ష పార్టీల నాయకులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## ఓటర్ల జాబితాపై రాజకీయ పార్టీలతో సమావేశం



పుల్లంపేట, సెప్టెంబర్ 16 ప్రభాతవార్త : స్థానిక ఎంపీడీవో కార్యాలయంలోని సభా భవనంలో బుధవారం ఇన్చార్జ్ ఎంపీడీవో శ్రీనివాసులు ఆధ్వర్యంలో పుల్లపేట మండలంలోని అన్ని రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న రోజుల్లో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఓటర్లు జాబితాను, పోలింగ్ బూత్ స్థాయి వారిగా ఓటర్ల జాబితాలో ఏవైనా తప్పులు, మార్పులు చేర్పులు ఉంటే అన్ని రాజకీయ పార్టీ నాయకులు అధికారుల దృష్టికి తీసుకువస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు ప్రస్తుతం అందజేసిన ఓటర్లు జాబితాను ఫైనల్ జాబితా కాదని అభ్యంతరాలను పరిశీలించిన అనంతరం అవసరమైన సవరణలు చేసి తుది ఓటర్ల జాబితాను ప్రకటిస్తామని ఇన్చార్జ్ ఎంపీడీవో తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏవో శ్రీధర్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు సుభాష్, ప్రవీణ్, జనార్ధన, మోనిక, లక్ష్మి, కళ, బిజెపి,టిడిపి జనసేన,వైఎస్ఆర్సిపి మండల స్థాయి గ్రామస్థాయి నాయకులు పాల్గొన్నారు

## డ్రోన్ నిఘాతో అసాంఘిక కార్యకలాపాల నియంత్రణ



చిట్వేలి, సెప్టెంబర్ 16 ప్రభాతవార్త: జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు ఆదేశాల మేరకు రేణిగుంట డీఎస్పీ వై. శ్రీనివాసరావు పర్యవేక్షణలో, కోడూరు రూరల్ సీఐ డి. శ్రీనివాసులు ఆధ్వర్యంలో చిట్వేలి ఎస్ఐ ఎస్. వినోద్ కుమార్ సిబ్బందితో కలిసి బుధవారం మండలంలో డ్రోన్ కెమెరాలతో ప్రత్యేక నిఘా చేపట్టారు. చెర్లోపల్లి, చిట్వేలి టౌన్‌తో పాటు గ్రామాల శివారు ప్రాంతాలు, అనుమానాస్పద ప్రదేశాల్లో డ్రోన్ కెమెరాల ద్వారా విస్తృతంగా పర్యవేక్షణ నిర్వహించారు. ముఖ్యంగా వినాయకుని నిమజ్జనం చేసే ప్రాంతాలను,పేకాట స్థావరాలు, కోళ్ల పందేలు, గంజాయి నిల్వలు, వినియోగానికి సంబంధించిన అనుమానాస్పద ప్రాంతాలు, బహిరంగంగా మద్యం సేవించే ప్రదేశాలపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు.డ్రోన్ నిఘాలో అనుమానాస్పద కదలికలు గుర్తించిన వెంటనే స్థానిక పోలీసుల ద్వారా స్పందించి, అవసరమైన చట్టపరమైన చర్యలు తీసుకునేలా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. అవసరాన్ని బట్టి మండలంలోని మరిన్ని గ్రామాల్లోనూ డ్రోన్ నిఘాను విస్తరించి అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేస్తామని అన్నారు. ప్రజలు తమ గ్రామాల్లో అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నట్లు గుర్తిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించి శాంతిభద్రతల పరిరక్షణకు సహకరించాలని ఎస్సై వినోద్ కుమార్ విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా వినాయక విగ్రహాల నిమర్జనం



రైల్వేకోడూరు రూరల్, సెప్టెంబర్ 16(ప్రభాతవార్త : రైల్వే కోడూరు మండలం లో ఉన్న వినాయక విగ్రహాలను బుధవారం సాయంత్రం పోలీసు సిబ్బంది ఆధ్వర్యంలో గట్టి బందోబస్తు మధ్య వినాయక నిమర్జన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. తిరుపతి జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు ఆదేశాల మేరకు రేణిగుంట డిఎస్పి శ్రీనివాసరావు పర్యవేక్షణలో ఓబులవారిపల్లి మండలం మంగంపేట చెరువు వద్ద పటిష్టమైన బందోబస్తు మధ్య నిమర్జన కార్యక్రమాన్ని నిర్వహించారు. నిమర్జన ప్రాంతంలో క్రేన్లు, జెసిబిలు, అంబులెన్స్,లైటింగ్ సౌకర్యాలు ఏర్పాటు చేయడం జరిగిందని అత్యవసర ఏర్పాట్లను ముందస్తుగా ఏర్పాటు చేసి నిమర్జనా కార్యక్రమాన్ని కట్టుదిట్టంగా నిర్వహిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. కోడూరు మండలం నుండి దాదాపు 170 విగ్రహాలను మంగంపేట చెరువుకు తరలించి నిమర్జనాన్ని ఏర్పాటు చేసినట్లు వారు తెలిపారు, ప్రజల భద్రతే పోలీసుల ప్రధాన లక్ష్యమని నిమర్జనం కార్యక్రమం ప్రశాంతంగా సురక్షితంగా నిర్వహించేందుకు పోలీస్ శాఖ అన్ని ముందస్తు చర్యలు చేపట్టినట్లు తెలిపారు

## ఘనంగా వైద్యశాఖ మంత్రి జన్మదిన వేడుకలు



రైల్వేకోడూరు రూరల్, సెప్టెంబర్ 16 ప్రభాతవార్త : రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మాత్యులు సత్యకుమార్ 57వ జన్మదినోత్సవ కార్యక్రమాన్ని బిజెపి ఎగ్జిక్యూటివ్ మెంబర్ మరియు మండల అధ్యక్షులు సాయం శ్రీధర్, గడ్డం చెంగల్ రాజు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఆసుపత్రి నందు రోగులకు బ్రెడ్లు మరియు పండ్లను అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ రాష్ట్రంలో వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ ప్రజాసేవ చేయడంలో ఆయనకు మించినవారు లేరని అదేవిధంగా ప్రజాసేవే కర్తవ్యం బిజెపిలో చిన్న స్థాయి నుంచి పెద్ద స్థాయి వరకు వెళ్లి రాష్ట్ర మంత్రిగా సత్యకుమార్ ఎదిగారని అదేవిధంగా ఆయన మరెన్నో జన్మదిన వేడుకలను జరుపుకోవాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ వైద్యులు బ్రహ్మకుమారి, ఓబులవారిపల్లి బిజెపి నాయకులు ముక్కా రూపేష్ రెడ్డి, వాకచర్ల సుబ్బారావు,ఎస్సీ లీడర్ పిడుగు విజయ్ కుమార్,మండల మహిళా అధ్యక్షురాలు కుప్పాల జ్యోతి తో పాటు బిజెపికి చెందిన కార్యకర్తలు పాల్గొని భారీ కేకును అభిమానులకు పంచిపెట్టారు.

## భక్తులకు అల్పాహార విందు ఏర్పాటు

రైల్వే కోడూరు రూరల్, సెప్టెంబర్ 16 ప్రభాతవార్త:

రైల్వే కోడూరు మండలంలోని ధర్మాపురం నందు టిడిపి నాయకులు పోకల మనీ ఆధ్వర్యంలో అల్పాహార విందును 200 మందికి ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పోకల మనీ మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాలుగా వినాయక చవితిని పురస్కరించుకొని భక్తులకు అల్పాహార విందును ఏర్పాటు చేశామన్నారు. అనంతరం విగ్రహాన్ని నిమజ్జనానికి తరలించినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇంచార్జి పటాన్ మోలా టిడిపి శ్రేణులు గ్రామస్తులు పాల్గొన్నారు.

## కనువిందు చేసిన కళా వైభవం

**9 రాష్ట్రాల నుండి 20 కళాబృందాలు**

ప్రభాతవార్తప్రతినిధి-తిరుమల:



వేంకటేశ్వర స్వామి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో బుధవారం ఉదయం చిన్నశేష వాహనసేవలో వివిధ రాష్ట్రాల కళాకారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. స్వామివారి వాహనసేవకు ముందు దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన కళాకారులు తమతమ సంప్రదాయ కళారూపాలను భక్తి, సంగీతం, నృత్య సమ్మేళనంతో ప్రదర్శించి భక్తులను పరవశింపజేశారు. 9 రాష్ట్రాలకు చెందిన 20 కళాబృందాల నుండి 539 మంది కళాకారులు పాల్గొన్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఒడిశా, తమిళనాడు, పశ్చిమబెంగాల్, అస్సాం, మహారాష్ట్ర, పుదుచ్చేరి, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన కళాకారులు తమ ప్రాంతాల కళా సంప్రదాయాలను తిరుమలలో ఆవిష్కరించారు. వైవిధ్యమైన కళారూపాలతో అలరించిన కళాకారులు వేంకటేశ్వర సంగీత, నృత్య కళాశాల కళాకారులు దేవేరులతో చిన్నశేష వాహనం, భరతనాట్యం, ఒడిశీ, గరగాటం తదితర కళారూపాలను ప్రదర్శించారు. శాస్త్రీయ నృత్యాలతో పాటు జానపద కళారూపాలు కూడా భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఆంధ్రప్రదేశ్ కళాబృందాలు ఎదుకుల వైభవం, కోలాటం ప్రదర్శించగా, పుదుచ్చేరి కళాకారులు ఒయ్యిల్లాట్టంను ప్రదర్శించారు. ఉత్తరప్రదేశ్‌లోని వారణాసి కళాకారులు ప్రదర్శించిన శ్రీమద్రామాయణం భక్తులను విశేషంగా అలరించింది. మహారాష్ట్ర కళాకారుల దగర్ గాజా, డ్రమ్స్, అస్సాం కళాకారుల బోర్థాల్, పశ్చిమబెంగాల్ కళాబృందాల ఒడిశీ నృత్యం ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. సంగీతం, అద్భుతమైన నృత్య విన్యాసాలు తిరుమల వీధులకు కళా శోభను తీసుకొచ్చాయి.

## మున్సిపల్

**కార్పొరేషన్ ఎన్నికలపై ఉత్కంఠ! -ఓటర్ల జాబితా ప్రచురణకు ఏర్పాట్లు**
**-బీసీ రిజర్వేషన్లపై హైకోర్టులో కొనసాగుతున్న విచారణ**

ప్రభాతవార్త-తిరుపతి:




మున్సిపల్ ఎన్నికల నిర్వహణపై ఉత్కంఠ కొనసాగుతోంది. ఒకవైపు పట్టణ స్థానిక సంస్థలకు సంబంధించి వార్డుల వారీ ఫొటో ఓటర్ల జాబితాల ప్రచురణకు రాష్ట్ర ఎన్నికల సంఘం ఏర్పాట్లు చేస్తుండగా, మరోవైపు స్థానిక సంస్థల్లో బీసీలకు రిజర్వేషన్ల అంశంపై హైకోర్టులో విచారణ కొనసాగుతోంది. స్థానిక సంస్థల్లో వార్డుల వారీ ఫొటో ఓటర్ల జాబితాలను సెప్టెంబర్ 22న ప్రచురించేందుకు ఎన్నికల సంఘం చర్యలు చేపట్టింది. 2026 జనవరి 1ను అర్హత తేదీగా పరిగణిస్తూ ఈ జాబితాలను రూపొందిస్తున్నారు. వీటిలో తిరుపతి, చిత్తూరు కార్పొరేషన్లు, పుత్తూరు, పలమనేరు మున్సిపాలిటీలు ఉన్నాయి. డీలిమిటేషన్ పూర్తయిన పట్టణ స్థానిక సంస్థల్లో వార్డు వారీ ఓటర్ల జాబితాల ప్రక్రియ ఇప్పటికే కొనసాగుతోంది. సెప్టెంబర్ 22న జాబితాలు ప్రచురించిన అనంతరం ఎన్నికల సన్నద్ధత మరింత ముందుకు సాగే అవకాశం ఉంది. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించడాన్ని సవాల్ చేస్తూ దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యాలపై హైకోర్టులో విచారణ కొనసాగుతోంది. 34 శాతం బీసీ రిజర్వేషన్లను నిర్ణయించడానికి ఉపయోగించిన పూర్తి గణాంకాలు, ఆధారాలను కోర్టు ముందు ఉంచాలని ధర్మాసనం ప్రభుత్వాన్ని ఆదేశించింది. బీసీ రిజర్వేషన్ కమిషన్ అధ్యయనం పూర్తిచేసేందుకు దాని గడువును ప్రభుత్వం సెప్టెంబర్ 30 వరకు పొడిగించింది.

-ఎన్నికల షెడ్యూల్‌పై ఆసక్తి:మున్సిపల్ ఎన్నికల ప్రక్రియను ఓటర్ల జాబితా సవరణ పూర్తయ్యే వరకు వాయిదా వేయాలంటూ దాఖలైన పిటిషన్లు కూడా కోర్టు పరిశీలనలో ఉన్నాయి. ఓటర్ల జాబితా సవరణ, వార్డుల పునర్విభజన, బీసీ రిజర్వేషన్లు తదితర అంశాలపై న్యాయపరమైన ప్రక్రియ కొనసాగుతున్న నేపథ్యంలో ఎన్నికల నోటిఫికేషన్‌పై స్పష్టత రావాల్సి ఉంది. సెప్టెంబర్ 22న వార్డు వారీ ఫొటో ఓటర్ల జాబితాల ప్రచురణ, బీసీ రిజర్వేషన్లపై హైకోర్టు విచారణ, తదుపరి కోర్టు ఉత్తర్వులు మున్సిపల్ ఎన్నికల షెడ్యూల్‌పై ప్రభావం చూపే అవకాశముంది. దీంతో అక్టోబర్‌లో ఎన్నికల నోటిఫికేషన్ వెలువడుతుందా అనే అంశంపై ప్రస్తుతానికి స్పష్టత లేదు. కోర్టు తదుపరి ఆదేశాలు, ఎన్నికల సంఘం తీసుకునే నిర్ణయాలపై ఎన్నికల షెడ్యూల్ ఆధారపడి ఉంటుంది.



## పార్టీకోసం గట్టిగా పనిచేయండి

**-ఊట్లకు సిఎం బాబు హితవు**

తిరుపతి.సెప్టెంబర్ 16ప్రభాతవార్త: స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీకోసం గట్టిగా పనిచేయాలని సిఎం చంద్రబాబునాయుడు హితవు చేశారు. సిఎం చంద్రబాబు నాయుడుని బుధవారం సాయంత్రం అధికార ప్రతినిధి ఊట్ల సురేంద్ర నాయుడు మర్యాదపూర్వకంగా కలిశారు.

## ఘనంగా పేరూరు జీవోస్ కాలనీ వినాయక నిమజ్జనం

తిరుపతి హెల్త్, సెప్టెంబర్ 16, ప్రభాతవార్త

తిరుపతి రూరల్ పేరూరు జీవోస్ కాలనీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మట్టి వినాయకుడి నిమజ్జనం బుధవారం ఘనంగా జరిగింది. మూడు రోజుల పూజలు అందుకున్న మట్టి వినాయకుడిని ట్రాక్టర్ పై ఊరేగించి కాలనీలోని వీధులలో ఊరేగింపు చేశారు. మేళతాళాల మధ్య అసోసియేషన్ సభ్యుల ఆనందోత్సాహాల నడుమ యువకులు చిన్నారుల నృత్యాల మధ్య ఊరేగింపు ఘనంగా సాగింది. ఈ సందర్భంగా నిర్వహించిన లడ్డూ వేలం పాటలో పాల్గొన్న పలువురు పోటీలు పడి లడ్డును వేలం పాడారు. చివరగా అసోసియేషన్ ప్రెసిడెంట్ ప్రదీప్‌రెడ్డి రెండు లక్షల నూట పదహారు రూపాయలకు లడ్డును దక్కించుకున్నారు. ఊరేగింపు అనంతరం అక్కడికక్కడే మట్టి విగ్రహాన్ని నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు ప్రదీప్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి హరి కేశవులు నాయుడు, మాజీ అధ్యక్షులు ప్రభాకర్ నాయుడు, సభ్యులు ముని రత్నం నాయుడు, సుధాకర్ రెడ్డి, నందకుమార్ రెడ్డి. తదితరులు పాల్గొన్నారు.

## పోలింగ్‌కేంద్రాల కుదింపు...మార్పుకు సూచనలు



శ్రీకాళహస్తిరూరల్,సెప్టెంబర్ 16 ప్రభాతవార్త: శ్రీకాళహస్తి మండలంలో త్వరలో జరగబోవు స్థానిక సంస్థల ఎన్నికల సమీక్షను ఎంపిడిఓ కార్యాలయంలో బుధవారం నిర్వహించారు.ఎంపిడిఓ పెంచుల్ కిషోర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో అన్ని రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన చర్చ విస్తృతంగా ప్రశాంత వాతావరణంలో జరిగింది.ఈ సందర్భంగా అధికారులు రాబోవు ఎన్నికల్లో నారాయణపురం, అరవకొత్తూరు, ఊరందూరు,టిఎంవి కండ్రిగ పంచాయతీలు శ్రీకాళహస్తి మున్సిపాలిటిలో విలీనమైనందువల్ల అక్కడ ఎన్నికలు ఉండవని నాయకులకు వివరించారు. దాంతో పోలింగ్ కేంద్రాలు కుదింపు తప్పదన్నారు.గతంలో 650 ఓట్లకు ఒక బూత్ ఉండేదని ప్రస్తుతం 1050ఓట్లకు ఒక బూత్‌ను ఖరారు చేయటం వల్ల ఽకూడా బూత్‌ల సంఖ్య తగ్గిందన్నారు.మండలంలో 2 కిలో మీటర్ల దూరంలో బూత్ ఉంటే వారికి ఓటు వేయటానికి రవాణా సౌకర్యం కల్పిస్తామన్నారు. కాగా బి.వెంకటాపురం ప్రాదేశిక సభ్యునికి సంబంధించి ఎంపేడు గ్రామ పంచాయతీ పరిధిలో పోలింగ్ కేంద్రాన్ని మండల పరిషత్ పాఠశాల నుంచిగ్రామ పంచాయతీలోకి మార్చాలని సింగల్ విండో మాజీ అధ్యక్షుడు తాటిపర్తి రవీంద్రరెడ్డి కోరారు.అందేరే అధికారి ఇఓ పిఆర్‌ఓడి పద్మజ సమాధానం చెప్పారు.ఈ కార్యక్రమాల్లో జడ్‌పిటిసి వెంకటసుబ్బారెడ్డి,మార్కెటింగ్ కమిటి ఛైర్మెన్ చెంచయ్యనాయుడు,మాజీ మండల పార్టీ అధ్యక్షుడు కామేష్ యాదవ్, బత్తిరెడ్డి,జగదీశ్వర్‌రెడ్డి,జగన్నాధం నాయుడు,కుంటిపూడి రమేష్ నాయుడు, వైకాపా నుంచి చెవిరెడ్డి మధుసూధనరెడ్డి, సురేంద్రయాదవ్, సిపిఎం నాయకులు ఆంగేరి పుల్లయ్య,గంధం మణి, బిజెపి రాఘవులు నాయుడు, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

## పిట్టల వారి వినాయక ప్రసాదం రూ.90వేలు



శ్రీకాళహస్తి,సెప్టెంబర్ 16 ప్రభాతవార్త: శ్రీకాళహస్తి పట్టణ నడిబొడ్డులోని పిట్టలవారి సందులో ఏర్పాటు చేసిన లడ్డు ప్రసాదం బుధవారం వేలం పాటలను నిర్వహించారు.ఈ వేలం పాటల్లో దొడ్డారం సురేష్ అలియాస్ చిన్న రూ.90వేలకు పాడుకున్నారు.ఇటీవల శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలో దార్మిక కార్యక్రమాలకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నారు. ఈ నేపథ్యంలో లడ్డు వేలం పాటల్లో పాకాల రమేస్, పాకల ధనూష్, దొడ్డారం సుధా,బీరకుప్పం అమ్ములు పాల్గొన్నారు.

## ఘనంగా మంత్రి జన్మదిన వేడుకలు

చిన్నగొట్టిగల్లు,సెప్టెంబర్ 16 ప్రభాతవార్త:

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి, ఎమ్మెల్యే సత్యకుమార్ యాదవ్ జన్మదినాన్ని పురస్కరించుకుని చిన్నగొట్టిగల్లు మండలంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో బీజేపీ నాయకులు, కార్యకర్తల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం, కేక్ కటింగ్ నిర్వహించారు. బీజేపీ మండల అధ్యక్షులు దండు కిషోర్ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# తిరుపతి డివిజన్

## పేరూరులో రంగురంగుల ముగ్గుల పోటీలు - మహిళల ప్రతిభకు ప్రశంసలు



తిరుపతి రూరల్: సెప్టెంబర్ 16 ప్రభాతవార్త పేరూరు పంచాయతీ పరిధిలోని ఎన్టీఆర్ కాలనీలో మహిళల కోసం నిర్వహించిన ముగ్గుల పోటీలు ఆదరణతో, ఉత్సాహభరితంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి అతిథులుగా టీడీపీ పేరూరు పంచాయతీ అధ్యక్షుడు ఎన్. శ్రీనివాసులు, పవర్ ట్రస్ట్ చైర్మన్ కె. సావిత్రి హాజరై పోటీలను ప్రారంభించారు. గ్రామ మహిళలు వివిధ ఆకృతులతో, రంగులతో అందమైన ముగ్గులు వేసి తమ ప్రతిభను ప్రదర్శించారు. ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ, ఇటువంటి సాంప్రదాయ కార్యక్రమాలు గ్రామీణ సంస్కృతిని నిలబెట్టడంలో ముఖ్య పాత్ర పోషిస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని టి. వెంకటేష్, ఆర్. సుబ్రహ్మణ్యం, కె. చంద్రశేఖర్, కె. మంజునాథ్, సి. శంకర మరియు గ్రామ ప్రజలు సమిష్టిగా నిర్వహించారు.పోటీల్లో విజేతల వివరాలు ఇలా ఉన్నాయి: ప్రథమ బహుమతి పి. గాయత్రికి రూ.1001 నగదు అందజేశారు. ద్వితీయ బహుమతి తులసికి రూ.700, తృతీయ బహుమతిగా ఆర్. ప్రియకు రూ.500 ఇచ్చారు. అలాగే సంధ్య, భాగ్యలక్ష్మి వారికి ప్రోత్సాహక బహుమతులుగా తలో రూ.500 చొప్పున అందజేశారు. కార్యక్రమం చివర్లో విజేతలకు బహుమతులు అందజేసి అభినందనలు తెలియజేశారు.

## చిన్నశేషునిపై శ్రీనివాసుడు.. హంసపై జ్ఞానప్రదాత - తుమ్మలగుంటలో బ్రహ్మోత్సవాల వైభవం



## రక్తదాన శిబిరం




తిరుపతి హెల్త్, సెప్టెంబర్ 16 ప్రభాతవార్త: రుయా ఆసుపత్రి చిన్నపిల్లల విభాగము నందు, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ జన్మదినం సందర్భంగా చిన్న పిల్లల విభాగంలో పండ్లు, ఫలాలు, చిన్న పిల్లలకు వారి తల్లికి, రుయా ఆసుపత్రి అదనపు వైద్య విద్య సంచాలకులు మరియు సూపరిటెండెంట్ డాక్టర్ బి మనోహర్ ఆధ్వర్యంలో తిరుపతి బిజెపి అధ్యక్షులు సామంచి శ్రీనివాస్, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ డాక్టర్ డి శ్రీహరి రావు, పండ్లను పంచిపెట్టారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ వారు రుయా ఆసుపత్రి ప్రాంగణంలో వైద్య ఆరోగ్యశాఖ మంత్రి జన్మదిన సందర్భంగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఏ ఎస్ కిరీటి, డాక్టర్ అంజన్ కుమార్, చిన్నపిల్లల విభాగ వైద్య అధ్యాపకులు, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ వైద్యులు, వైద్య సిబ్బంది, తిరుపతి జిల్లా బిజెపి కార్యకర్తలు, రూపేష్, నాగార్జున రెడ్డి, సుబ్రహ్మణ్యం, నవీన్ కుమార్, బిజెపి యువ మోర్చా దాము రాయల్, ఎస్వి వైద్య కళాశాల పిఆర్వో వీర కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## 11, 12, 13 తేదీలలో...పిడిఎస్‌యూ రాష్ట్ర మహాసభలు




తిరుపతి హెల్త్, సెప్టెంబర్ 16 ప్రభాతవార్త: తిరుపతి నగరంలో డిసెంబర్ 11, 12, 13 తేదీలలో పిడిఎస్‌యు 24వ రాష్ట్ర మహాసభలు జయప్రదం చేయాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు కే భాస్కర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం వినోద్ కుమార్ పిలుపునిచ్చారు. బుధవారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో వారు ఇరువురు మాట్లాడారు. జార్జి రెడ్డి జన్మించిన జిల్లాలో 54 ఏళ్ల పిడిఎస్‌యూ చరిత్రలో మొట్ట మొదటిసారిగా రాష్ట్ర 24వ మహాసభలు నిర్వహిస్తున్నామన్నారు. కేంద్రంలో 12 ఏళ్ల మోడీ పాలనలో విద్యా రంగం, ఉపాధి అవకాశాలు విధ్వంసం అయ్యాయన్నారు. రాష్ట్రంలో రెండు లక్షల పైగా ప్రభుత్వ ఉద్యోగాలు ఖాళీగా ఉన్న కూటమి ప్రభుత్వం అరా కొర భర్తీ చేస్తున్నాయని ఆరోపించారు.శాశ్వతమైన గౌరవ ప్రదమైన ఉపాధి ప్రతి విద్యార్థి హక్కు అనే నినాదంతో 24వ రాష్ట్ర మహాసభలు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ మహాసభలకు ప్రొఫెసర్స్, మేధావులు, దేశవ్యాప్తంగా 12 రాష్ట్రాల నుండి పిడిఎస్‌యూ ప్రతినిధులు హాజరవుతార న్నారు. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి లోకేష్ పీజీ విద్యార్థులకు శాపంగా మారిన జీవో నెంబర్ 77ను 100 రోజుల్లో రద్దు చేస్తామని ఎలక్షన్ల హామీలో చెప్పారని,అది నేటికి రద్దు చేయలేదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పిడిఎస్‌యు రాష్ట్ర ఉపాధ్యక్షుడు మహర్షి, జిల్లా అధ్యక్షులు జాకీర్, కార్యదర్శి లోకేష్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నేతి నాగేశ్వర తదితరులు పాల్గొన్నారు.

## ఇండ్ల స్థలాలు కూల్చి, డంపింగ్ యార్డ్ ఏర్పాటు!



తిరుపతి హెల్త్, సెప్టెంబర్ 16 ప్రభాతవార్త: తిరుపతి జిల్లా, పుత్తూరు మండలంలోని కోనేటిపాలెం గ్రామ లెక్క దాఖల సర్వే నెంబర్ 199,247లో ఖాతా నెం 508లో ఏ.1.64 సెంట్లు, లేట్ రామకృష్ణయ్య, ఏ గుణసుందరి అనుభవంలో వుంటే, 2002లో లేట్ రామకృష్ణయ్య ఒక ఎకరాలో 50 మంది పేదలకు ఒక్కొక్క ఇంటికి రెండు సెంట్లు భూమి ఉచితంగా ఇచ్చారని, మిగిలిన 64 సెంట్ల భూమిని ఏ గుణసుందరి 30 మంది పేదలకు ఉచితంగా ఇస్తుంటే రెవెన్యూ అధికారులు అడ్డుపడి ఇండ్లను కూల్చివేయడం జరిగిందని ఆరోపించారు. బుధవారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో జరిగిన విలేకరుల సమావేశంలో పాళ్యం ప్రజలు, రఘు, సురేష్ కుమార్, రజిని మాట్లాడారు. కూల్చిన ఇండ్ల జాగాలలో డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేయడం సమంజసమా? అని, కోనేటి పాళ్యం ప్రజలు అధికారులను ప్రశ్నించారు. ఇండ్ల దగ్గర డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేస్తే, త్రాగునీరు కలుషితం అవుతుందని, పిల్లలు, ప్రజలు ఇబ్బందులు పడి, రోగాల బారిన పడతారని కోనేటి గ్రామానికి చెందిన మహిళలు పుత్తూరు ఎమ్మెల్యే భాను ప్రకాష్, తిరుపతి జిల్లా కలెక్టర్, ఎస్పికి విజ్ఞప్తి చేశారు.పుత్తూరు మండల తాసిల్దార్, రెవెన్యూ అధికారులు మిగిలిన 64 సెంట్ల భూమిని ప్రైవేటు వ్యక్తులకు ఇవ్వడానికి 30 మంది కుటుంబాలను భయ భ్రాంతులకు గురి చేస్తున్నట్లు ఆరోపించారు. కలెక్టర్, ఎస్పీ, ఎమ్మెల్యే భాను ప్రకాష్ విచారణ జరిపి రెవెన్యూ అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకొని, కోనేటి పాళ్యం గ్రామానికి చెందిన ప్రజలకు న్యాయం చేయాలని కోరారు.ఈ సమావేశంలో కోనేటిపాళ్యం గ్రామ ప్రజలు,బాధితులు పాల్గొన్నారు.

## ఘనంగా ఎమ్మెస్ సుబ్బలక్ష్మి జయంతి వేడుకలు



తిరుపతి హెల్త్, సెప్టెంబర్ 16 ప్రభాతవార్త: భారతరత్న ఎమ్మెస్ సుబ్బలక్ష్మి జయంతి వేడుకలను తిరుపతిలోని రామచంద్ర పుష్కరిణి వద్ద బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆమె చిత్రపటానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నాయీ బ్రాహ్మణ సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ రుద్రకోటి సదాశివం పూలమాలవేసి అంజలి ఘటించి, కర్పూర నీరాజనాలు సమర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశ సంగీత సామ్రాజ్యంలో ఎమ్మెస్ సుబ్బలక్ష్మి తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని సంపాదించు కున్నారన్నారు. సంగీత ప్రపంచంలో భారతరత్న అందుకున్న ప్రధమ సంగీత కళాకారిణిగా చరిత్రలో నిలిచారన్నారు. కేవలం భారత దేశంలోనే కాకుండా ప్రపంచ వ్యాప్తంగా తన స్వర మాధుర్యంతో ఆకట్టుకున్నారని చెప్పారు. ఎం.ఎస్.సుబ్బలక్ష్మి గాత్రం కర్ణాటక సంగీతాన్ని భారతదేశ సరిహద్దులు దాటి ప్రపంచ వ్యాప్తంగా పరిచయం చేసిందని తెలిపారు.ఆమె 16 సెప్టెంబర్ 1916న మదురైలో జన్మించారని, చిన్ననాటి నుంచే సంగీతాన్ని అభ్యసించిన సుబ్బలక్ష్మి బాల్యంలోనే వేదికలపై ప్రదర్శనలు ఇచ్చారని,17 ఏళ్ల వయసులో మద్రాస్ మ్యూజిక్ అకాడమీ వేదికపై పాడి విశేష గుర్తింపు పొందారని గుర్తు చేశారు. కర్ణాటక సంగీతంతో పాటు భక్తి సంగీతాన్ని కూడా ఆమె ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లారని విష్ణు సహస్రనామం, భజ గోవిందం, వెంకటేశ్వర సుప్రభాతం, ఎంతో ప్రసిద్ధి చెందాయన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ నాదస్వర విద్వాంసులు వి సత్యనారాయణ, ప్రముఖ డోలు విద్వాంసులు ఊట్ల వారి పల్లి మునిరత్నం, పండ్లూరి గోవిందశెట్టి, రాళ్లపాటి కృష్ణారావు, ఎం రామచంద్రయ్య, రావిపాటి సత్యనారాయణ, ఎస్ ఎం శ్రీనివాసులు,ఈ.నాగరాజు, ఏ కృష్ణమూర్తి, ఏ కర్ణ, తదితరులు పాల్గొన్నారు.